Follow: @ANNTELUGU

ANN తెలుగు

03-05-2025

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 151 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## పీవోకేలో ఎమర్జెన్సీ

### మెరుపుదాడికి భారత్ సన్నాహాలు

### వాయుసేన విన్యాసాలు ఆరంభం

**మహా:** ఓ వైపు పీవోకేలో ఎమర్జెన్సీ.. మరోవైపు భారత వాయుసేన విన్యాసాలు మెరుపుదాడులకు సంకేతంగా నిలుస్తున్నాయి. జమ్మూ కాశ్మీర్ ప్రధాని చౌదరి అన్వరుల్ హక్ సంచలన ఉత్తర్వులు జారీ చేశారు. అఖిలపక్ష సమావేశం తర్వాత నియంత్రణ రేఖ సమీపంలో నివసిస్తున్న నివాసితులు ఆహారం, అవసరమైన వస్తువులను నిల్వ చేసుకోవాలని కోరారు. నీలం లోయ, ఎల్ఓసీ పక్కనే ఉన్న ప్రాంతాల్లోకి పర్యాటకులను నిలిపేశారు. సైనిక సంఘర్షణ జరిగితే సహాయక చర్యలకు మద్దతుగా రూ. 1 బిలియన్ విలువైన అత్యవసర ప్రతిస్పందన నిధిని ఏర్పాటు చేశారు. అదనంగా, నీలం, జీలం, పూంచ్, హవేలి, కోట్లి, భీంబర్‌తో సహా కీలకమైన ఎల్ఓసి నియోజకవర్గాలలో రోడ్లు తెరిచి ఉండేలా చూసుకోవడానికి అధికారిక, ప్రైవేట్ యంత్రాగాన్ని మోహరించారు.

మిగతా 2లో

### టాప్ న్యూస్


**అమెరికా వీసా కోసం కాన్సులేట్ కార్యాలయానికి కేసీఆర్**



- ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నేరుగా గచ్చిబౌలికి కేసీఆర్
- కేసీఆర్‌తో పాటు జోగినపల్లి సంతోష్, జీవన్ రెడ్డి
- త్వరలో కేసీఆర్ అమెరికా పర్యటన

03

**భారత్–చైనా కలిసి పని చేయాలి**



- బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్
- చైనా ప్రేక్షకులు మనలాగే స్పందిస్తారన్న అమీర్ ఖాన్
- భారత్-చైనా సినీ సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయి
- భావోద్వేగాలు ఒక్కటే.. కలిసి పనిచేస్తే లాభమన్న అమీర్

03

**4 నెలలకే చేతులెత్తేసిన జొమాటో**




- జొమాటో 15 నిమిషాల 'క్విక్' ఫుడ్ డెలివరీ సేవ నిలిపివేత
- ప్రారంభించిన 4 నెల్లలోనే యాప్ నుంచి ఫీచర్ తొలగింపు

03



## గొర్రెల పంపిణీ స్కామ్

- ప్రధాన నిందితుడు అరెస్ట్
- దుబాయ్ నుంచి రాగానే శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేసిన పోలీసులు
- ఏసీబీ న్యాయమూర్తి ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలింపు

వివరాలు 2లో



## సింగరేణి అభివృద్ధిలో దూసుకెళ్ళాలి

- పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవాలి
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం
- జూన్ 2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు పత్రాల అందజేత
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వివరాలు 2లో



## అల్లు అర్జున్ నెల్లూరు పెద్దారెడ్డి తాలూకా

### సోషల్ మీడియాలో వీడియో వైరల్

వివరాలు 3లో




# అమరావతికి సహకరిస్తాం

## ప్రధాని మోదీ భరోసా

అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు

చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు

ఏపీ సరైన మార్గంలో ... సరైన వేగంతో ముందుకెళ్తోంది

అమరావతి పూర్తయితే ఏపీ రాష్ట్రం చరిత్ర గతి మారుతుంది

చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, మహా :** అమరావతి ఒక ఒక శక్తి అని, స్వర్ణాంధ్రప్రదేశ్‌కు ఇది శుభ సంకేతమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలని ప్రధాని ఆకాంక్షించారు. అమరావతి నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామన్న ప్రధాని.. రాష్ట్రంలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుందని వ్యాఖ్యానించారు. శుక్రవారం అమరావతి పునఃనిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన అనంతరం ప్రధాని మోదీ ప్రసంగించారు. తన ప్రసంగాన్ని తెలుగులో మొదలు పెట్టిన ఆయన.. "దుర్గాభవానీ కొలువైన ఈ పుణ్య భూమిలో మిమ్మల్ని కలవడం ఆనందంగా ఉంది" అన్నారు. తన ప్రసంగం మధ్యమధ్యలో తెలుగులో మాట్లాడుతూ ఆకట్టుకున్నారు.

మిగతా 2లో

**అమరావతి 2.0 Special Story** 04

## సీడబ్ల్యూసీలో తెలంగాణ విజయపతాక

### తెలంగాణ మోడల్ ను పరిగణనలోకి తీసుకోవాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేయడం తెలంగాణకు గర్వకారణమన్న సీఎం రేవంత్

సీఎం రేవంత్ పై సిడబ్ల్యుసి భేటీ సందర్భంగా ప్రశంసలు



**హైదరాబాద్, మహా:** సిడబ్ల్యుసిలో తెలంగాణ విజయ పతాక రెపరెపలాడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన అసామాన్య సాహసం, కేంద్రాన్ని మెప్పించేలా చేసిన కార్యాచరణ పై చర్చ జరిగింది. ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీసులో అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో సీడబ్ల్యుసి సమావేశమయ్యింది.కాంగ్రెస్ సీనియర్లు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి,హిమాచల్ ప్రదేశ్ సీఎం సఖ్విందర్ సింగ్ సుఖ్ హాజరయ్యారు. జన గణనలో కుల గణనకు తెలంగాణ మోడల్ ను పరిగణనలోకి తీసుకోవాలని అఖిల భారత కాంగ్రెస్ అత్యున్నత నిర్ణాయక మండలి ఐన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ... తీర్మానం చేసింది. నాలుగు గోడల మధ్య... నలుగురి ఆలోచనలతో కాక... మొత్తం పౌర సమాజం... తెలంగాణ మేధావులు... వివిధ కుల సంఘ నాయకులు... విద్యావేత్తల నుండి అత్యంత పారదర్శకంగా సలహాలు, సూచనలు స్వీకరించి... శాస్త్రీయంగా తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపట్టిన విషయాన్ని సిడబ్ల్యుసి తన తీర్మానంలో ప్రస్తావించింది.

మిగతా 2లో



## ఇది రేవంత్ సర్కార్ విక్టరీ

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

గవర్నర్ జిష్ణుదేవ్ ను కలిసి ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ టీమ్

**హైదరాబాద్, మహా:** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో కుల గణన నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో కామారెడ్డి డిక్లరేషన్ కు అనుగుణంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చట్ట బద్ధత కల్పించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు ఏప్రిల్ 8న గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపిందన్నారు.

మిగతా 2లో

## షాక్‌లో కిషన్ రెడ్డి

### బీజేపీ అధ్యక్షుడిగా ఫెయిల్ అయ్యాననే భావన ఆయనలో ఉంది

అందుకే కులగణనపై విమర్శలు.. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యలు




**హైదరాబాద్, మహా:** కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రస్తుతం షాక్‌లో ఉన్నారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా ఆయన విఫలమయ్యారనే భావనలో ఉండడం వల్లనే ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. ఆయనకు తన పార్టీ అధిష్ఠానం నుంచి మొట్టికాయలు పడి ఉంటాయని అభిప్రాయపడ్డారు. 'మీరు తెలంగాణలో ఏం చేస్తున్నారు?' అని అధిష్ఠానం ప్రశ్నించి ఉంటుందని వ్యాఖ్యానించారు. కిషన్ రెడ్డి సాధారణంగా వివాదాస్పద అంశాలకు దూరంగా ఉంటారని, కానీ ఈ మధ్య తరచూ ప్రకటనలు చేస్తూ ఉండటం గమనించామన్నారు. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనపై ఢిల్లీ పెద్దల ఒత్తిడి ఉండవచ్చని పేర్కొన్నారు.

మిగతా 3లో

## మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

### 7వ తేదీ నుంచి అందుబాటులోకి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి



**మహా :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఈనెల 7వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత నెల 10వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని 30వ తేదీ నాటికి 22 కార్యాలయాల్లో సగటున 866 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు.

మిగతా 3లో

**పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ బ్యాన్** 07







# అమరావతికి సహకరిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

''టెక్నాలజీ నాతో మొదలైనట్లు చంద్రబాబు ప్రశంసించారు. నేను గుజరాత్ సీఎం అయ్యాక హైదరాబాద్‌లో ఐటీని ఎలా అభివృద్ధి చేశారో తెలుసుకున్నా. అధికారుల్ని పంపించి హైదరాబాద్ ఐటీ అభివృద్ధిని అధ్యయనం చేయించా. పెద్ద ప్రాజెక్టులు చేపట్టాలన్నా.. త్వరగా పూర్తి చేయాలన్నా చంద్రబాబుకే సాధ్యం. పెద్ద పెద్ద పనుల్ని చేపట్టి పూర్తి చేయడంలో చంద్రబాబును మించిన నేత దేశంలో లేరు. 2015లో ప్రజా రాజధానిగా అమరావతికి శంకుస్థాపన చేశా. గత పదేళ్లలో అమరావతికి కేంద్రం మద్దతుగా నిలిచింది. అభివృద్ధికి అన్ని రకాలుగా సహకరించింది. ఇప్పుడూ అమరావతి అభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుంది. అమరావతిలో అన్ని రకాల నిర్మాణాలకు కేంద్రం తోడ్పాటు అందిస్తుంది'' అన్నారు.

**పవన్ జీ.. ఇది మనమే చేయాలి..**

''ఎన్టీఆర్.. వికసిత ఏపీ కోసం కలలుగన్నారు. మనందరం కలిసి ఆయన కలల్ని నిజం చేయాలి. వికసిత్ భారత్‌కు ఏపీ గ్రోత్ ఇంజిన్‌గా ఎదగాలి. పవన్ కల్యాణ్ గారూ ఇది మనం చేయాలి. మనమే చేయాలి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలిచింది. ఏపీలో రైలు, రోడ్డు ప్రాజెక్టులకు కేంద్రం రూ.వేల కోట్లు సాయం చేస్తోంది. ఇప్పుడు నేను పుణ్యభూమి అమరావతిపై నిలబడి ఉన్నప్పుడు నాకు కనబడుతున్నది ఒక్క నగరం మాత్రమే కాదు.. ఒక స్వప్నం సాకారాం కాబోతోందనే భావన కలుగుతోంది. దాదాపు రూ. 60వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశా. ఇవి కేవలం కాంక్రీటు నిర్మాణాలు కాదు.. ఏపీ ప్రగతి, ఆశలు, వికసిత్ భారత్ ఆశయాలకు బలమైన పునాదులు. వీరభద్ర స్వామి, అమరలింగేశ్వరస్వామి, తిరుపతి వెంకటేశ్వరస్వామికి పాదాలకు నమస్కరిస్తూ ఏపీ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు. చంద్రబాబు, పవన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నా'' అన్నారు. ''ఇంద్రలోకం రాజధాని అమరావతి. ఇప్పుడు ఏపీ రాజధాని పేరు కూడా అమరావతే. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభ సంకేతం. ఏపీని ఆధునిక ప్రదేశ్, అధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతి. అమరావతి ఒక నగరం కాదు.. ఒక శక్తి. యువత కలలు సాకారమయ్యే రాజధానిగా ఈ నగరం ఎదుగుతుంది. ఐటీ, ఏఐ సహా అన్ని రంగాలకూ అమరావతి గమ్య స్థానంగా మారుతుంది. హరితశక్తి, స్వచ్ఛ పరిశ్రమలు, విద్య, వైద్య కేంద్రంగా అమరావతి మారుతుంది. అమరావతిలో మౌలికవసతుల కల్పనకు కేంద్ర సహకరిస్తుంది'' అని చెప్పారు.



**అన్ని రంగాల్లో ముందడుగు**

''ఏపీలో కనెక్టివిటీకి కొత్త అధ్యాయం మొదలవుతుంది. రైల్వే ప్రాజెక్టులతో ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు, మరో రాష్ట్రానికి అనుసంధానం పెరుగుతుంది. ఈ అనుసంధానం తీర్థయాత్రలకు పర్యాటకాభివృద్ధికి ఉపయోగపడుతుంది. ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలకు రైల్వే బడ్జెట్ రూ.900 కోట్ల లోపే ఉండేది. ఇప్పుడు కేవలం ఏపీకే రూ.9వేల కోట్ల రైల్వే నిధులు ఇచ్చాం. ఏపీకి గతం కంటే పది రెట్లు అధికంగా నిధులు కేటాయించాం. గత పదేళ్లలో ఏపీలో 750 రైల్వే బ్రిడ్జ్‌లు, అండర్‌పాస్‌లు నిర్మించాం. వందేభారత్, అమృత్ భారత్ రైళ్లు కేటాయించాం. ఏపీలో 70కి పైగా రైల్వే స్టేషన్లను అమృత్ భారత్ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేస్తున్నాం. మౌలిక వసతుల కల్పనతో ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది. సిమెంట్, స్టీల్, రవాణా రంగాలు అభివృద్ధి చెందుతాయి. ఈ ప్రాజెక్టుల వల్ల వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. రైతు వికాసానికి కేంద్రం ప్రత్యేకంగా కృషిచేస్తోంది. రైతులకు పథకాలు, పరిహారం కింద రూ.17వేల కోట్లు సాయం చేశాం. పోలవరం త్వరగా పూర్తి చేసేందుకు కలిసి పనిచేస్తాం. ప్రతి ఎకరానికీ నీరు ఇచ్చేందుకు కృషిచేస్తాం'' ''వికసిత్ భారత్ నిర్మాణం కావాలంటే మహిళలు, కార్మికులు అభివృద్ధి చెందాలి. ఈ నాలుగు వర్గాలు నాలుగు స్తంభాలు లాంటివారు. రక్షణ రంగాన్ని బలోపేతం చేస్తున్నాం. నాగాయలంకలో టెస్టింగ్ రేంజ్.. దుర్గామాత లాగా భారత రక్షణ రంగానికి శక్తినిస్తుంది. శ్రీహరికోట నుంచి ప్రయోగించే ప్రతి రాకెట్ కోట్లాది భారతీయులకు గర్వకారణం. భారత శక్తి అంటే కేవలం మన ఆయుధాలే కాదు.. మన ఐక్యత కూడా. విశాఖలో యునిటీమాల్ అభివృద్ధి చేస్తున్నాం''

**విశాఖలో యోగా డేకు వస్తా**

''విశాఖలో జూన్ 21న జరగనున్న యోగా డేలో పాల్గొంటాను. నన్ను ఆహ్వానించినందుకు ప్రభుత్వానికి థ్యాంక్స్. మన యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు ఉంది. వచ్చే 50 రోజులూ ఏపీలో యోగాకు అనుకూల వాతావరణం కల్పించాలి. ఏపీలో కలలు కనేవాళ్ల సంఖ్య తక్కువేం కాదు.. ఆ కలల్ని నిజం చేసేవారి సంఖ్యా తక్కువకాదు. ఏపీ సరైన మార్గంలో నడుస్తోంది. సరైన వేగంతో ముందుకెళ్తోంది. దీన్ని కొనసాగించాలి. మూడేళ్లలో అమరావతి పనుల్ని పూర్తి చేస్తామని సీఎం అన్నారు. ఆ పనులు పూర్తయ్యాక ఏపీ జీడీపీ ఏ స్థాయికి వెళ్తుందో నేను ఊహించగలను. అది ఏపీ రాష్ట్రం చరిత్ర గతిని మార్చబోతోంది. ఏపీ అభివృద్ధిలో మీ భుజంతో కలిపి నా భుజం కలిపి పని చేస్తాను. అందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు'' అని ప్రధాని తెలిపారు.

**చరిత్రలో నిలిచే రోజు - చంద్రబాబు**

అమరావతి రాజధాని పున:ప్రారంభోత్సవం జరిగిన రోజు చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయే రోజని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. గత ఐదు సంవత్సరాలు రాజధాని పనులు ఆగిపోయాయని, విధ్వంసం జరిగిందని అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ' ఈ రోజు చాలా గొప్ప రోజు. చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజు. ఆ రోజు అమరావతి పనులకు ప్రధాని మోదీ గారు శంకుస్థాపన చేశారు. ఐదు సంవత్సరాలు విధ్వంసం జరిగింది. పనులు నిలిచిపోయాయి. మళ్లీ ప్రధాని మోదీ గారే పున:ప్రారంభం చేస్తున్నారంటే.. దీనికంటే మంచి రోజు చరిత్రలో ఇంకోటి లేదని విజ్ఞప్తి చేస్తున్నాను' అని అన్నారు.

## సీడబ్ల్యుసీలో తెలంగాణ విజయపతాక

### తెలంగాణ మోడల్ ను పరిగణనలోకి తీసుకోవాలన్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ

కేంద్రాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం చేయడం తెలంగాణకు గర్వకారణమన్న సీఎం రేవంత్

సీఎం రేవంత్ పై సిడబ్ల్యుసి భేటీ సందర్భంగా ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)

జనాభా దామాషా పద్దతిలో రిజర్వేషన్లు వర్గీకరించాలని కాంగ్రెస్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోంది. వీలైనంత త్వరగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెస్తోంది. కులగణన లెక్కల ప్రకారం ఆయా వర్గాలకు బడ్జెట్ లో కేటాయింపులు ఉండాలని కాంగ్రెస్ కోరుతోంది. కులగణనపై కాంగ్రెస్ ఇప్పటికే ప్రాధాన్యతను చాటుకుంది. కాంగ్రెస్ వత్తిడివల్లే మోదీ ప్రభుత్వం దిగొచ్చి కులగణనకు సిద్ధమైందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఇప్పటికే స్పష్టం చేశారు.

**తెలంగాణకు గర్వకారణం - సీఎం రేవంత్ రెడ్డి**

ఇది తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని, ఒక గొప్ప సామాజిక విప్లవానికి నాంది పలికే ప్రక్రియ విషయంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్ గా నిలవడం తనకెంతో గర్వంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అత్యద్భుతంగా, అత్యంత పారదర్శకంగా కుల గణన నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను దేశ స్థాయిలో చాటిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.



## ఇది రేవంత్ సర్కార్ విక్టరీ

### పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

గవర్నర్ జిష్ణుదేవ్ ను కలిసి ధన్యవాదాలు తెలిపిన కాంగ్రెస్ టీమ్

(మొదటి పేజీ తరువాయి)

ఈ నేపథ్యంలో తెలంగాణ బీసీ మంత్రులు, నేతలతో కలిసి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు.

**రాహుల్ ఆశయం నెరవేరింది..**

కులగణన క్రెడిట్ రాహుల్ గాంధీ కే దక్కుతుందని కొనియాడారు. కేంద్రం జనగణన తో పాటు కుల గణన నిర్ణయం రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రభుత్వ విజయం అని అభివర్ణించారు. తెలంగాణ మోడల్ ను కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తోందన్నారు. కుల గణన పై కేంద్రం నిర్ణయం తో రాహుల్ ఆశయం నెరవేరిందన్నారు. రాహుల్ గాంధీ ఆశయం మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం కుల గణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందన్నారు.

## సింగరేణి అభివృద్ధిలో దూసుకెళ్ళాలి

### పోటీ మార్కెట్లో నిలదొక్కుకోవాలి.. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే మా లక్ష్యం

**జూన్ 2న రాజీవ్ యువ వికాసం లబ్ధిదారులకు పత్రాల అందజేత.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, మహా:** 13 దశాబ్దాల చరిత్ర ఉన్న సింగరేణి కాలరీస్ ఇక ముందు కూడా అభివృద్ధి పథంలో ముందుకు పోతూ కేవలం బొగ్గు గని గానే కాక వేల మందికి ఉపాధి చూపే ఉద్యోగాల గనిగా రూపుదిద్దుకోవాలని ఆ దిశగా కార్మికులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. మన ముందు తరాల వారు ఆరోగ్యంగా, ఆర్థికంగా బలమైన సింగరేణి సంస్థను మనకు అందించారని, మనం కూడా మన వారసులకు ఉజ్వల సింగరేణిని అందించకపోతే భావి తరాలకు తీరని నష్టం చేసిన వాళ్లం అవుతామని హెచ్చరించారు. సింగరేణి అభివృద్ధిలో కింది ఉద్యోగి నుంచి సీఎండీ వరకు అందరికీ సమాన బాధ్యత ఉంటుందని, సంస్థ ప్రయోజనాల దృష్ట్యా కఠినమైన నిబంధనలు అమలు చేస్తూ ముందుకెళ్లాలని స్పష్టం చేశారు. ఉద్యోగులకు కష్టంగా ఉంటుందని ఉదాసీనంగా వ్యవహరించడం వల్ల రాబోయే రోజుల్లో ఇబ్బందుల పాలవుతామని, నిబంధనలతో, శ్రమతో కూడిన అడుగులు వేయాలన్నారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే ప్రజా భవన్ లో శుక్రవారం సాయంత్రం సింగరేణి కారుణ్య నియామకాల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచడం వల్ల లబ్ధి పొందిన వారసులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కారుణ్య ఉద్యోగాలలో గరిష్ట వయోపరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని కార్మికులు, కార్మిక సంఘాలు కోరిన ఎదుట దీనిపై తక్షణమే మానవతా దృక్పథంతో స్పందించి అంగీకరించామని, దీనివల్ల 35 సంవత్సరాల వయో పరిమితి దాటిన అనేక వందల మందికి ఉద్యోగాలు లభించే అదృష్టం దక్కిందన్నారు. నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. సింగరేణి సంస్థ నేడు పోటీ మార్కెట్లో ఇతరులతో పోటీపడి నిలవాల్సిన పరిస్థితి ఉందని, కనుక సింగరేణి కార్మికులు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూ పూర్తి పనిగంటలు పనిచేస్తూ కంపెనీని కాపాడుకోవాలని భవిష్యత్తు తరాలకు దీనిని ఒక వారసత్వంగా అందించాలన్నారు. సింగరేణిని ఇతర




రంగాల్లోకి, ఇతర రాష్ట్రాల్లోకి కూడా విస్తరిస్తున్నామని, ఈ ప్రణాళికలు విజయవంతం కావాలంటే ప్రతీ ఒక్కరూ శ్రమ శక్తిని చాటాలన్నారు.

కొత్తగా ఉద్యోగంలో చేరిన సింగరేణి వారసులు తేలికపాటి ఉద్యోగం కోసం విఫల ప్రయత్నాలు చేయకుండా, ఇచ్చిన పనిని సమర్థంగా నిర్వహిస్తూ కంపెనీ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అదే సమయంలో తమ ప్రభుత్వం రాష్ట్రంలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో 9 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు రాష్ట్ర అవతరణ దినం జూన్ 2వ తేదీన పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. ఇది లక్షల మందికి ఉపాధి లభించే బృహత్ పథకంగా అమలు చేయనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా సింగరేణి వ్యాప్తంగా సడలించిన వయోపరిమితి ద్వారా కారుణ్య నియామకం పొందిన 21 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, దేశంలో ఎక్కడా లేనివిధంగా వయోపరిమితి సడలింపుకు అంగీకరించి, అనేక కుటుంబాల్లో వెలుగు నింపిన రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి, ప్రభుత్వానికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. గుర్తింపు కార్మిక సంఘం జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్ మాట్లాడుతూ వయో పరిమితిని 35 నుంచి 40 సంవత్సరాలకు పెంచడం ఒక సంచలనాత్మక నిర్ణయం అని, దీనిపై తాము రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఉద్యోగంలో చేరిన యువత కష్టపడి పనిచేస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని, గైర్హాజరీలకు పాల్పడవద్దని సూచించారు. ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ మరియు రాష్ట్ర కనీస వేతనాల సలహా సంఘం ఛైర్మన్ శ్రీ బి.జనక్ ప్రసాద్ మాట్లాడుతూ దేశం లో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంక్షేమానికి సహకరిస్తుందని, కాంట్రాక్టు కార్మికులకు కూడా 5000 రూపాయల బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. దేశంలో ఏ బొగ్గు సంస్థల్లో లేని విధంగా సింగరేణిలో వయో పరిమితిని 40 ఏళ్ల కు పెంచడం కూడా ఇక్కడ నే సాధ్యమైంది అన్నారు. గతంలో ఏ రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి కృషి చేయనివిధంగా శ్రీ భట్టి విక్రమార్క మల్లు సంస్థ అభివృద్ధికి పాటుపడుతున్నారన్నారు. ఆయన ఆధ్వర్యంలో రానున్న రోజుల్లో మరో ఆరు గనులు.. 20వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్ (పి అండ్ పి, పర్సనల్) కె.వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ , జీఎం(పర్సనల్) ఐఆర్, పీఎం కవిత నాయుడు పాల్గొన్నారు.

## గొర్రెల పంపిణీ స్కామ్

### ప్రధాన నిందితుడు అరెస్ట్

దుబాయ్ నుంచి రాగానే శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్టు చేసిన పోలీసులు

ఏసీబీ న్యాయమూర్తి ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలింపు

**మహా :** రాష్ట్రంలో పెను దుమారం రేపుతున్న గొర్రెల పంపిణీ పథకం అవినీతి కేసులో కీలక నిందితుడు చివరకు చిక్కాడు. ఈ పథకంలో మొదటి నుంచి ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ 1 నిందితుడు మోయినుద్దీన్‌ను శుక్రవారం ఉదయం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. దుబాయ్ నుంచి అతడు శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అధికారులు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దీనిపై సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఇదివరకే 17 మందిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు.. తాజాగా ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న మోయినుద్దీన్‌ను అదుపులోకి తీసుకోవడంతో దర్యాప్తు మరింత ముమ్మరం కానుంది. అరెస్టు అనంతరం అతడిని వెంటనే విమానాశ్రయం నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్ ిథర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు. గొర్రెల పంపిణీ పథకంలో జరిగిన అక్రమాల్లో మోయినుద్దీన్ కీలక పాత్ర పోషించినట్లు ఏసీబీ ప్రాథమికంగా నిర్ధారించింది. నిధుల మళ్లింపు, నాణ్యత లేని గొర్రెల సరఫరా లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు వంటి అనేక అంశాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు రూ. 700 కోట్ల మేర అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్న ఈ పథకంలో పలువురు రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు కూడా పాత్రధారులుగా ఉన్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏసీబీ అధికారులు ఇప్పటికే ఈ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు. మోయినుద్దీన్ అరెస్టుతో ఈ కేసు కీలక మలుపు తిరిగే అవకాశం ఉంది. అతడిచ్చే సమాచారం ఆధారంగా మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం కూడా లేకపోలేదు. ఈ స్కాం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది.



పశుసంవర్ధక శాఖ అధికారులు లబ్ధిదారుల కోసం తెలంగాణలో గొర్రెలను కొనుగోలు చేయకుండా.. వారిని ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి అక్కడి వ్యాపారుల నుంచి కొనుగోలు చేయించారు. అయితే, విక్రేతలకు చెల్లించాల్సిన సొమ్మును నేరుగా ఇవ్వకుండా.. మధ్యవర్తులు.. బినామీల ఖాతాలకు మళ్లించినట్లు దర్యాప్తులో తేలింది. ప్రత్యేకంగా బ్రోకర్లను, ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని ఏకంగా రూ. 2.1 కోట్లను దారి మళ్లించినట్లు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) గుర్తించింది. ఈ నిధులు ఎక్కడికి వెళ్లాయనే కోణంలో ఏసీబీ అధికారులు లోతుగా దర్యాప్తు కొనసాగించారు. ఈ క్రమంలో బినామీ ఖాతాదారులను విచారించగా బ్రోకర్లు, ప్రభుత్వ అధికారుల కీలక పాత్రకు సంబంధించిన బలమైన ఆధారాలు లభ్యమయ్యాయి. ఈ మొత్తం కుంభకోణంలో గొర్రెల కొనుగోలు కాంట్రాక్టర్‌గా వ్యవహరించిన మోయినుద్దీన్ సూత్రధారిగా వ్యవహరించాడని ఏసీబీ అధికారులు నిర్ధారించారు. అతడు అధికారులతో కుమ్మక్కై నిధులను బినామీ ఖాతాలకు మళ్లించడంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో మరికొందరు అధికారులు , ప్రైవేటు వ్యక్తులు కూడా లబ్ధి పొందారని ఏసీబీ అనుమానిస్తోంది. నిధుల మళ్లింపునకు సంబంధించిన పూర్తి వివరాలు రాబట్టేందుకు ఏసీబీ అధికారులు మోయినుద్దీన్‌ను మరింత లోతుగా విచారించే అవకాశం ఉంది. ఈ స్కాం వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరనేది తేలాల్సి ఉంది.

## పీవోకేలో ఎమర్జెన్సీ

### మెరుపుదాడికి భారత్ సన్నాహాలు

**వాయుసేన విన్యాసాలు ఆరంభం**

(మొదటి పేజీ తరువాయి)

పీఓకేలోని పౌర రక్షణ దళాలను హై అలర్ట్‌లో ఉంచారు. స్థానిక డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులు ప్రజలకు అత్యవసర రెస్క్యూ హెల్ప్ లైన్ నంబర్ 1122ని జారీ చేశారు. పీఓకే అధికారులు ఎల్ఓసీ వెంబడి సరిహద్దుల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు, ప్రధాని నరేంద్రమోడీ సహా భారత నేతల ప్రకటన మధ్య కరాచీ, లాహోర్‌లోని ప్రధాన విమానాశ్రయాల ఎయిర్‌స్పేస్ ప్రతీ రోజు 8 గంటలు మూసేస్తున్నారు.

**వాయుసేన విన్యాసాలు**

పహల్గాం ఉగ్రదాడితో పాకిస్థాన్‌పై భారత్ మెరుపుదాడి చేస్తుందన్న అంచనాల మధ్య వాయుసేన విన్యాసాలు ప్రారంభించింది. యూపీలోని గంగాఎక్స్‌ప్రెస్‌రహదారిపై యుద్ధవిమానాల టేకాఫ్ల్యాండింగ్‌ఆపరేషన్లు చేపట్టింది. హైవేలో భాగమైన 3.5 కి.మీ పొడవైన షాజహాన్‌పూర్‌ఎయిర్‌స్ట్రిప్‌పై రఫేల్, జాగ్వార్, మిరాజ్ 2000, సుఖోయ్30 ఎంకేఐ వంటి ఫైటర్లు సహా సైనిక కార్గో విమానాల సన్నద్ధతను వాయుసేన పరీక్షించింది. కేవలం మీటర్‌ఎత్తులో ఫైటర్‌జెట్లు ప్రదర్శించిన ఫ్లైపాస్‌అభ్యాసం ఆకట్టుకుంది. యుద్ధ సమయంలో రన్‌వేలకు ప్రత్యామ్నాయంగా ఎక్స్‌ప్రెస్‌హైవేల సామర్థ్యాన్ని అంచనావేసేందుకు ఈ అభ్యాసాల్ని చేపట్టారు. రాత్రి వేళల్లోనూ టేకాఫ్, ల్యాండింగ్‌ఫైటర్లు అయ్యేలా దేశంలోనే తొలిసారి ఈ ఎయిర్‌స్ట్రిప్‌ను సిద్ధం చేశారు. ఇవాళ రాత్రి 710 గంటల మధ్య విన్యాసాలు నిర్వహించి నైట్‌టైం ల్యాండింగ్‌సన్నద్ధతను వాయుసేన అంచనా వేయనుంది. పహల్గాం దాడి తరువాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరిన వేళ వాయుసేన ఈ పరీక్షలు నిర్వహించడం గమనార్హం. యుద్ధ విమానాల ఫ్లైపాస్ట్ జరగుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఎయిర్‌స్ట్రిప్ అంతటినీ కవర్ చేస్తూ దాదాపు 250 సీసీకెమెరాలను ఇన్‌స్టాల్ చేసింది.

**సర్వసన్నద్ధంగా త్రివిధ దళాలు**

పాక్‌తో ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో త్రివిధ సైనిక దళాలు సర్వసన్నద్ధం అవుతున్నాయి. భారత నావికా దళం అరేబియా సముద్రంలో తన కార్యకలాపాలను ముమ్మరం చేసింది. వార్ షిప్స్‌ను మోహరించి సుదూర లక్ష్యాలను కూడా ఛేదించేలా యాంటీషిప్ మిసైల్ ఫైరింగ్‌ను విజయవంతంగా నిర్వహించింది.





## అల్లు అర్జున్ నెల్లూరు పెద్దారెడ్డి తాలూకా

### సోషల్ మీడియాలో వీడియో వైరల్

**మహా:** ప్రముఖ నటుడు అల్లు అర్జున్ మరోసారి ట్రెండింగ్ లో నిలిచారు. ఈసారి బ్రహ్మానందంను వాడేసి హాట్ టాపిక్ అయ్యారు. అల్లు అర్జున్ వేసుకున్న టీ షర్ట్ సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. ఆయన ఒక వైట్ టీషర్ట్ వేసుకోగా, దానిపై బ్రహ్మానందం ఇది వరకు సినిమాలో చెప్పిన "నెల్లూరు పెద్దారెడ్డి తాలూకా" అనే డైలాగ్ ఇంగ్లీషులో రాసి ఉంది. ఈ టీ షర్టు పై హాస్యబ్రహ్మగా పేరుపొందిన బ్రహ్మానందం ఫోటోలు ఉండి, ఆయన చెప్పిన డైలాగ్ కింద ఇంగ్లీషులో రాసి ఉంది. దీంతో ప్రస్తుతం బన్నీ వేసుకున్న టీ షర్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.


# భారత్-చైనా కలిసి పని చేయాలి

## బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్

చైనా ప్రేక్షకులు మనలాగే స్పందిస్తారన్న అమీర్ ఖాన్

భారత్‌చైనా సినీ సహకారానికి అపార అవకాశాలు ఉన్నాయి

భావోద్వేగాలు ఒక్కటే.. కలిసి పనిచేస్తే లాభమన్న బాలీవుడ్ నటుడు



**మహా:** భారతీయ, చైనా చలనచిత్ర రంగాల మధ్య సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని ప్రముఖ బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల ప్రేక్షకుల మధ్య భావోద్వేగ, సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని, కలిసి పనిచేయడం ద్వారా సృజనాత్మకంగా, ఆర్థికంగా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చని పేర్కొన్నారు. 'వేవ్స్' (వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్) రెండో రోజు కార్యక్రమంలో ఎన్డీటీవీ ఎడిటర్ఇన్‌చీఫ్ సంజయ్ పుగాలియాతో మాట్లాడుతూ అమీర్ ఖాన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా మార్కెట్‌లో 'దంగల్' వంటి తన చిత్రాలు ఘనవిజయం సాధించిన నేపథ్యంలో అమీర్ ఖాన్ ఈ అంశంపై మాట్లాడారు. గత కొన్నేళ్లలో తాను అనేకసార్లు చైనాను సందర్శించానని, అక్కడి ప్రేక్షకుల స్పందన, భావోద్వేగాలు భారతీయ ప్రేక్షకులకు చాలా దగ్గరగా ఉంటాయని గమనించినట్లు తెలిపారు. "నా చిత్రాలకు, ముఖ్యంగా దంగల్‌కు చైనా ప్రేక్షకులు స్పందించిన తీరు, భారతీయ ప్రేక్షకుల స్పందన దాదాపు ఒకేలా ఉన్నాయి. భావోద్వేగాలు విశ్వజనీనమైనవి" అని ఆయన వివరించారు. భారత్, చైనా రెండు దేశాల్లోనూ ఎంతో ప్రతిభావంతులైన, చైతన్యవంతమైన సృజనాత్మక బృందాలు ఉన్నాయని అమీర్ ఖాన్ అన్నారు. "చైనాలో రూపొందుతున్న చిత్రాలు, వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలను నేను చూశాను. వారి పనితనం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో ఉంది" అని ప్రశంసించారు. రెండు దేశాల మధ్య సృజనాత్మక భాగస్వామ్యం ఏర్పడితే అది ఇరు పక్షాలకూ ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. "సృజనాత్మకంగా, భావోద్వేగాల పరంగా, అలాగే వ్యాపార పరంగా చూసినా, మనం కలిసి పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చు. ఈ అవకాశాలను ఎలా అందిపుచ్చుకోవాలనే దానిపై గత కొన్నేళ్లుగా చైనాలోని నా మిత్రులతో చర్చిస్తూనే ఉన్నాను. ఇప్పుడు వేవ్స్ వంటి వేదికల ద్వారా ఈ ప్రయత్నాలకు మరింత ఊపు వస్తుందని నమ్ముతున్నాను" అని అమీర్ ఖాన్ తెలిపారు. భారత్, చైనా రెండూ గొప్ప చరిత్ర, సంస్కృతి కలిగిన ప్రాచీన నాగరికతలని గుర్తుచేస్తూ, ఒకరి నుంచి ఒకరు నేర్చుకోవాల్సింది చాలా ఉందని అన్నారు. చైనాకు చెందిన సృజనాత్మక ప్రతిభావంతులతో కలిసి పనిచేసేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.

# 4 నెలలకే చేతులెత్తేసిన జొమాటో

జొమాటో 15 నిమిషాల 'క్విక్' ఫుడ్ డెలివరీ సేవ నిలిపివేత

ప్రారంభించిన 4 నెలల్లోనే యాప్ నుంచి ఫీచర్ తొలగింపు




**మహా:** ప్రముఖ ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో, వినియోగదారులకు వేగంగా ఆహారాన్ని అందించేందుకు ప్రారంభించిన 15 నిమిషాల 'క్విక్' డెలివరీ సేవను చడీచప్పుడు కాకుండా నిలిపివేసింది. ప్రారంభించిన నాలుగు నెలల వ్యవధిలోనే ఈ ఫీచర్‌ను తమ యాప్ నుంచి తొలగించడం గమనార్హం. వేగవంతమైన డెలివరీ వ్యూహంలో జొమాటో కీలక మార్పులు చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. గతంలో 10 నిమిషాల డెలివరీ ప్రయోగం 'జొమాటో ఇన్‌స్టంట్' విఫలమైన తర్వాత, ఇలాంటి అల్ట్రాఫాస్ట్ సర్వీస్‌ను సంస్థ నిలిపివేయడం ఇది రెండోసారి. జొమాటో యాప్‌లోని ఎక్స్‌ప్లోర్ విభాగంలో కనిపించే 'క్విక్' ట్యాబ్ ప్రస్తుతం అందుబాటులో లేదు. బెంగళూరు, గురుగ్రామ్, హైదరాబాద్, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఈ సేవ నిలిచిపోయినట్లు తెలుస్తోంది. సమీపంలోని (సుమారు 2 కి.మీ పరిధిలోని) రెస్టారెంట్ల నుంచి తక్షణమే సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను వేగంగా డెలివరీ చేయడమే 'క్విక్' ముఖ్య ఉద్దేశ్యం. ఈ సేవ నిలిపివేతపై జొమాటో యాజమాన్యం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. అయితే, మార్చి నెలలో జొమాటో మొత్తం ఆర్డర్లలో 'క్విక్' ద్వారా వచ్చినవి దాదాపు 8 శాతం వరకు ఉన్నాయని సమాచారం. గతంలోనూ జొమాటో ఇలాంటి ప్రయత్నం చేసి విఫలమైంది. 2022లో 'జొమాటో ఇన్‌స్టంట్' పేరుతో 10 నిమిషాల్లో డెలివరీ సేవను ప్రారంభించి, 2023 జనవరి నాటికి దాన్ని మూసివేసింది. తాజాగా 'క్విక్'ను కూడా తొలగించడం వెనుక నిర్వహణ సవాళ్లు, పోటీ సంస్థల నుంచి ఒత్తిడి కారణాలుగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ తరహా వేగవంతమైన డెలివరీ ప్రయోగాలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయని, వ్యాపారంపై పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని జొమాటో సీఎఫ్ఓ అక్షంత్ గోయల్ గతంలోనే వ్యాఖ్యానించారు.

# షాక్‌లో కిషన్ రెడ్డి

బీజేపీ అధ్యక్షుడిగా ఫెయిల్ అయ్యాననే భావన ఆయనలో ఉంది

అందుకే కులగణనపై విమర్శలు..

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యలు




(మొదటిపేజీ తరువాయి)

బీసీ కులగణనలో తప్పులున్నాయని కిషన్ రెడ్డి చేసిన ప్రకటనను జగ్గారెడ్డి తప్పుబట్టారు. కులగణన పక్కాగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. సర్వే జరిగిన నెల రోజులు కిషన్ రెడ్డి ఢిల్లీలో ఉండి, ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతో శ్రమించి కులగణన చేశామని, దాని ఫలితం తమకు దక్కుతుందని అన్నారు. 95 ఏళ్ల తర్వాత కులగణన జరిగిందని గుర్తు చేశారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఈ మధ్య ఎక్కువగా మాట్లాడటం లేదని జగ్గారెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి రాజకీయ లబ్ధి కంటే సామాజిక న్యాయానికి ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కన్నా ప్రజల శ్రేయస్సు ముఖ్యమని రాహుల్ గాంధీ భావిస్తారని అన్నారు. ఓట్ల కోసం రాజకీయాలు చేసే ఉద్దేశం తమకు లేదని ఆయన స్పష్టం చేశారు.

# మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

(మొదటిపేజీ తరువాయి)




గురువారం సచివాలయంలోని తమ కార్యాలయంలో స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ విభాగంపై సుదీర్ఘంగా మంత్రి సమీక్షించారు. రెండవ దశలో రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్ , షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, షేర్ లింగంపల్లి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్, ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీ నగర్, అదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల,పెద్దపల్లి, కల్వకుర్తి , వనపర్తి, గద్వాల్, గజ్వేల్ మెదక్ జిల్లాలో సిద్దిపేట అర్బన్ & రూరల్, రంగారెడ్డి వరంగల్ హైదరాబాద్, హైదరాబాద్ సౌత్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లలో అమలు చేస్తామని తెలిపారు. 22 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను అధికారులను అడిగి తెలుసుకున్నారు స్లాట్ బుకింగ్ విధానం అమలు అవుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి పోస్ట్ కార్డుద్వారా అభిప్రాయాలను సేకరించగా 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు మంత్రికి ఈసందర్భంగా వివరించారు. పోస్టు కార్డులో ఉన్న ఫోన్ నెంబర్‌తో చంపాపేట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విష్ణుగౌడ్ అనే వ్యక్తితో మంత్రి స్వయంగా ఫోన్‌లో మాట్లాడి స్పందన తెలుసుకున్నారు. స్లాట్ బుకింగ్‌కు అవసరమైన ఇంటర్నెట్ స్పీడ్‌ను పెంచుకోవాలని సూచించారు. వచ్చే నెల 3వ వారం నాటికి రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తేవాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మరింత వేగవంతం చేయడానికి ఆధార్ ఈ సంతకం ప్రవేశపెడుతున్నామని వీలైనంత త్వరితగతిన అమలులోకి తేవాలని అధికారులను ఆదేశించారు.

**అభినందనలు - కృతజ్ఞతలు**

స్లాట్ బుకింగ్ విధానం విజయవంతం కావడంలో అధికారుల పాత్ర ప్రశంసనీయం. ఇందుకు కృషి చేసిన అధికారులందరికీ అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా పనిచేసి స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ మంచిపేరు తీసుకురావాలని కోరారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా అధికారులు ఏ పనిచేసినా ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించడమే లక్ష్యంగా ఉండాలని అభిలషించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, స్టాంప్స్& రిజిస్ట్రేషన్ ఐజీ జ్యోతి బుద్ధప్రకాష్, సిసిఎల్ఎ సెక్రటరీ మకరంద్, మీసేవ డైరెక్టర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ కోర్టులో అఘోరీ శ్రీనివాస్..!

### మరో 14 రోజులు రిమాండ్ ను పొడిగించిన న్యాయమూర్తి



**షాద్ నగర్,మహా:** మహిళా సినీ నిర్మాతను మోసగించిన కేసులో అఘోరీని మోకిల పోలీసులు అరెస్టు ఇటీవల అరెస్టు చేసి జైలుకు తరలించిన విషయం విధితమే. అయితే 14 రోజుల రిమాండ్ ముగిసిపోవడంతో మరోసారి మోకిలా పోలీసులు అఘోరిని చేవెళ్ల కోర్టుకు తీసుకువచ్చారు. చేవెళ్ల కోర్టు ఇన్చార్జి కొత్త రవి షాద్ నగర్ కోర్టులో నూతనంగా బాధ్యతలు స్వీకరించడంతో పోలీసులు ఇంచార్జ్ న్యాయమూర్తి కొత్త రవి విధులు నిర్వహిస్తున్న షాద్ నగర్ కోర్టుకు తీసుకువచ్చారు. ఇక్కడ పోలీసులు అఘోరిని కోర్టులో ప్రవేశపెట్టడంతో న్యాయమూర్తి కొత్త రవి అఘోరికి రిమాండ్ విధిస్తూ మరో 14 రోజులు పొడిగించారు. దీంతో అఘోరిని చంచల్గూడా జైలుకు పోలీసులు తరలించారు. షాద్ నగర్ కోర్టుకు అఘోరిని తీసుకువస్తున్నారని తెలియడంతో మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. ఆమెతో మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ పోలీసులు అనుమతించలేదు. రిమాండ్ పొడిగించగానే ఆమెను ప్రత్యేక వాహనంలో చంచల్గూడా జైలుకు తరలించారు. ఇటీవల అఘోరీ కారులో హరిద్వార్ వెళ్తుండగా పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అఘోరిని ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో రెండు గంటలపాటు విచారించాక చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం చేవెళ్ల కోర్టులో న్యాయమూర్తి ఎదుట హాజరుపరుచగా, న్యాయమూర్తి 14రోజుల రిమాండ్ విధించడంతో సంగారెడ్డి జిల్లా కంది సబ్‌జైలుకు తరలించారు. అంతకు ముందు అఘోరీని ఏ బ్యారక్‌లో ఉంచాలో తేల్చుకోలేక కంది జైలు అధికారులు తలలు పట్టుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం తిరిగి జైలుకు పంపించారు. ప్రస్తుతం మరో 14 రోజులు షాద్ నగర్ కోర్టు రిమాండ్ పొడిగించడంతో చంచల్ గూడ జైలుకు తరలించారు..

# నేతన్నలకు గుడ్ న్యూస్

- లక్ష రూపాయల వరకు ఉన్న రుణాలు మాఫీ
- మార్గదర్శకాలను జారీ చేసిన చేనేత శాఖ ముఖ్య కార్యదర్శి
- ఏప్రిల్ 2017 తర్వాత తీసుకున్న రుణాలన్నింటికీ వర్తింపు
- సహకరించాలని బ్యాంకర్లను కోరిన ప్రభుత్వం

**మహా :** చేనేత కార్మికులకు రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అసలు, వడ్డీ కలిపి రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ పథకంలో భాగంగా 2017 ఏప్రిల్ 1 వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో వ్యక్తిగతంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి, కార్యనిర్వహణ మూలధనం, ఇతర వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం రుణాలు తీసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని రాష్ట్ర చేనేత శాఖ స్పష్టం చేసింది. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, చేనేత క్రెడిట్ కార్డుల కింద తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేయనున్నట్లు వెల్లడించింది. రుణమాఫీ అమలుపై రాష్ట్ర చేనేతశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మార్గదర్శకాలు జారీ చేశారు. రుణమాఫీ అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆమేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయి. ఎవరైనా కార్మికులు ప్రస్తుతం చేనేత కార్యకలాపాల్లో లేకపోయినా, వారి ఖాతాలు నిరర్థక ఆస్తుల ఖాతా (ఎన్‌పీఏ) కింద ఉన్నా మళ్లీ రుణాలు రావు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సత్వరమే అర్హులైన చేనేత కార్మికుల రుణమాఫీకి అన్ని జిల్లాల ఏడీలు చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాల్లో శైలజారామయ్యర్ వెల్లడించారు. దీనికి బ్యాంకులు సహకరించాలని కోరారు. కాగా, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే జిల్లాస్థాయి కమిటీలో డీసీసీబీ సీఈవో, చేనేతశాఖ ఆర్‌డీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారి సభ్యులుగా ఉంటారు. చేనేత శాఖ ఏడీ కన్వీనర్‌గా ఉంటారు. జిల్లా పరిధిలో చేనేత కార్మికులు నిర్దిష్ట కాలంలో రుణాలు పొందిన వివరాలను శాఖ ఏడీలు బ్యాంకర్ల నుంచి తీసుకోవాలి. వాటి ఆధారంగా కార్మికులవారీగా క్లెయిమ్‌లను తయారు చేసి జిల్లాస్థాయి కమిటీ ఆమోదం కోసం పంపించాలి. జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రతిపాదనలు పంపిస్తారు. చేనేతశాఖ డైరెక్టర్ అధ్యక్షత వహించే ఈ కమిటీలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ, టెస్కాబ్, నాబార్డు రాష్ట్రస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. అదనపు డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లాస్థాయి కమిటీ నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రుణమాఫీ మొత్తం ఆయా చేనేత కార్మికుల ఖాతాల్లో జమ అవుతుంది. అనంతరం బ్యాంకర్లు ఎలాంటి బకాయిల్లేవని (నో డ్యూస్) ధ్రువీకరణ పత్రం ఇస్తారు.

# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌కు ఢిల్లీ కోర్టు నోటీసులు

## విచారణ 8వ తేదీకి వాయిదా



**మహా :** నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు ఢిల్లీ కోర్టు శుక్రవారం నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించిన పీఎంఎల్ఏ కేసులో ఈడీ ఛార్జిషీట్‌ను రౌస్ అవెన్యూ కోర్టు విచారణకు స్వీకరించింది. చార్జిషీట్‌కు సంబంధించిన కేసును విచారించడానికి నిందితులైన సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా ఇతర నిందితులు కోర్టుకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు తదుపరి విచారణను ఈ నెల 8వ తేదీకి కోర్టు వాయిదా వేసింది. నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ 2025 ఏప్రిల్ 9న మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్లు 3 మరియు 4 కింద చార్జిషీట్ దాఖలు చేసింది. ఈ కేసులో సోనియా గాంధీని ఏ1గా, రాహుల్ గాంధీని ఏ2గా ఈడీ చేర్చింది. కాంగ్రెస్ నాయకులు సామ్ పిట్రోడా, సుమన్ దూబే వంటి వారు కూడా నిందితులుగా ఉన్నారు. నేషనల్ హెరాల్డ్ అనేది 1938లో జవహర్‌లాల్ నెహ్రూ స్థాపించిన చారిత్రక వార్తాపత్రిక. యంగ్ ఇండియన్ లిమిటెడ్ (వైఐఎల్) ద్వారా ఏజేఎల్‌కు చెందిన రూ.2,000 కోట్ల విలువైన ఆస్తులను కేవలం రూ.50 లక్షలకు సోనియా, రాహుల్ గాంధీ కొనుగోలు చేశారని ఈడీ అభియోగాలు మోపింది. వైఐఎల్‌లో రాహుల్‌కు 38శాతం, సోనియాకు 38శాతం షేర్లు ఉన్నాయి. ఏజేఎల్‌కు చెందిన 99 శాతం షేర్లను యంగ్ ఇండియన్ లిమిటెడ్‌కు బదిలీ చేశారు. ఈ లావాదేవీ మనీలాండరింగ్‌లో భాగమన్నది ఈడీ ప్రధాన ఆరోపణ.

# పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ చాక్లెట్




**అమరావతి, మహా:** ఏపీ రాజధాని అమరావతి పునఃప్రారంభోత్సవంలో ఆసక్తికర ఘటన జరిగింది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్రధాని మోదీ సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇచ్చారు. పవన్ కల్యాణ్ తన ప్రసంగం పూర్తి చేసుకుని తిరిగి వెళ్తున్న సమయంలో ప్రధాని మోదీ పిలిచారు. కానీ అది పవన్ కల్యాణ్‌కు వినబడలేదు. దీంతో ప్రసంగం ముగించుకుని వేదికపై తనకు కేటాయించిన సీటు దగ్గరకు వెళ్లి కూర్చుని, నాదెండ్ల మనోహర్‌తో మాటల్లో పడిపోయారు. దీంతో పవన్ కల్యాణ్‌ను పిలవమని పక్కనే కూర్చున్న ఏపీ సీఎం చంద్రబాబుకు మోదీ సూచించారు. ప్రధాని మోదీ పిలవడంతో పవన్ కల్యాణ్ హడావుడిగా ఆయన దగ్గరకు వెళ్లారు. అప్పుడు దగ్గరకు వచ్చిన పవన్ కల్యాణ్‌ను ప్రధాని మోదీ అభినందించారు. అనంతరం నవ్వుతూ పవన్ కల్యాణ్ చేతిలో ఒక చాక్లెట్ పెట్టారు. అది చూసి పవన్ కల్యాణ్ మురిసిపోయారు. ఇదంతా పక్కనే ఉన్న చంద్రబాబు కూడా గమనించి తెగ నవ్వేశారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది.



## అమెరికా వీసా కోసం కాన్సులేట్ కార్యాలయానికి కేసీఆర్

- ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నేరుగా గచ్చిబౌలికి కేసీఆర్
- కేసీఆర్ తో పాటు జోగినపల్లి సంతోష్, జీవన్ రెడ్డి
- త్వరలో కేసీఆర్ అమెరికా పర్యటన

**హైదరాబాద్, మహా:** గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి మాజీ సీఎం కేసీఆర్ వెళ్లారు. అమెరికా వీసా కోసం కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. ఇప్పటికే సికింద్రాబాద్ పాస్ పోర్ట్ కార్యాలయంలో పాస్పోర్ట్ రెన్యువల్ కి సంబంధించిన లీగల్ టీమ్ సమర్పించారు.. ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి నేరుగా అమెరికన్ కాన్సులేట్ కి చేరుకున్న కేసీఆర్ తో పాటు జోగినపల్లి సంతోష్, జీవన్ రెడ్డి ఉన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 19 కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి వచ్చిన విషయం తెలిసిందే. పాస్ పోర్ట్ రెన్యువల్ కోసం ఆయన కార్యాలయానికి వచ్చారు. ఆయనతో ఉన్న డిప్లమాటిక్ పాస్‌పోర్ట్ ను సబ్మిట్ చేసి సాధారణ పాస్‌పోర్ట్ ను తీసుకునేందుకు సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం నందిని నివాసానికి బయలుదేరారు. తాజాగా మరోసారి గచ్చిబౌలిలోని అమెరికన్ కాన్సులేట్ కార్యాలయానికి వచ్చారు. త్వరలో కేసీఆర్ అమెరికా వెళ్ళనున్నారు.

# నష్టపోయిన ప్రతి గింజకు నష్టపరిహారం..!

## ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతిన్న పంటలకు నష్ట పరిహారం ఇస్తాం .. షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

హుటాహుటిన వడగండ్లకు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే .. ఫరూక్ నగర్ మండలంలో దెబ్బతిన్న పంటల సందర్శన

నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని వ్యవసాయ అధికారులకు ఎమ్మెల్యే శంకర్ ఆదేశాలు

**షాద్ నగర్,మహా:** అకాల వర్షంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. రాత్రి కురిసిన అకాల వడగండ్ల వర్షానికి ఫరూక్ నగర్ మండలంలోని అనేక గ్రామాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. ఈ సమాచారాన్ని తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హుటాహుటిన శుక్రవారం ఉదయమే నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఫరూఖ్ నగర్ మండలం చిల్కమరి గ్రామంలో గత రాత్రి వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న వరి పంటలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా చిలకమర్రిలో రైతులు బడికెల యాదయ్య, వెంకట్ రెడ్డి, చిలకమర్రి రవీందర్ రెడ్డిలను తదితరులను కలిసి పంట నష్టానికి గల కారణాలను రైతుల నుండి అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టితో ప్రతి రైతు యొక్క నష్టపోయిన పంట నష్టాన్ని అంచనా వేయాలని వ్యవసాయ శాఖ ఏడి రాజారత్నం, ఏఈ నిశాంత్ కుమార్ తదితరులను ఆదేశించారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఆరుగాలం కష్టించి రైతు సాగు చేసి, పండించిన పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షం వడగండ్ల వాన వలన రైతులు నష్టపోయి బాధపడుతున్నారని, నష్టపోయిన ప్రతి గింజకు నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంటలు నష్టపోవడం జరిగిందని ఇలాంటి సమయంలో రైతాంగాన్ని మానవత దృక్పథం కోణంలో ఆదుకునేందుకు సిద్ధంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, నేతలు అగ్గనూర్ బస్వం ,రాజేందర్ రెడ్డి,ఇబ్రహీం ,శ్రీశైలం గౌడ్, రాయికల్ శ్రీనివాస్, నవీన్,అందే మోహన్ ముదిరాజ్,రవీందర్ రెడ్డి, నర్సింమా రెడ్డి, మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్,అనిల్ పాల్గొన్నారు..




మహా పత్రిక
ANN తెలుగు
04
శనివారం, హైదరాబాద్
03-05-2025

ఏపీ ప్రజా రాజధానికి మహర్దశ మొదలైంది.. అమరావతి 2.0 మొదలైంది.. ఏపీ రాష్ట్రంలో నవశకం మొదలైంది. రాజధాని అమరావతిని మేటి నగరంగా తీర్చిదిద్దేందుకు మొత్తం 11 కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని మోదీ అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో ఈ పనులకు శంకుస్థాపన చేశారు. రాజధానిలో రూ.75 వేల కోట్ల పనులు చేపట్టాలని నిర్ణయించగా.. ఇప్పటివరకు రూ.49 వేల కోట్ల వ్యయంతో పనులు చేయడానికి టెండర్లు పిలిచారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేయడానికి కాంట్రాక్టు సంస్థలన్నీ సంసిద్ధంగా ఉన్నాయి. రాజధానికి అసలైన రూపం మరో మూడేళ్ల తర్వాత కనిపిస్తుంది. ఐకానిక్ భవనాలుగా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్లను మూడేళ్లలో, ఇతర ప్రాజెక్టులను రెండేళ్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది. గత అనుభవాల నేపథ్యంలో ఈ సారి త్వరితగతిన పట్టాలెక్కించేలా పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. రాజధానిలో సీఆర్‌డీఏ ఆధ్వర్యంలో కీలక ప్రాజెక్టులు చేపడుతున్నారు. మొత్తం 11 ప్రాజెక్టులు రాజధానికి మణిహారంలా భాసిల్లనున్నాయి.

- మహా ప్రత్యేకం





## హ్యాపీనెస్ట్

రాజధాని నేలపాడులో హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు తిరిగి పురుడు పోసుకుంటోంది. రూ.856.31 కోట్ల వ్యయంతో తొలి రెసిడెన్షియల్ హౌసింగ్ ప్రాజెక్టును ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో జీ + 18 అంతస్తులతో కూడిన 12 టవర్లను నిర్మించబోతున్నారు. మొత్తం 1200 అపార్ట్‌మెంట్లు ఉంటాయి. 2018లో ఫస్ట్ కమ్ ఫస్ట్ ప్రాతిపదికన మొదటి నుంచి 1200 వరకు దరఖాస్తు చేసిన లబ్ధిదారులను ఎంపిక చేశారు. అత్యాధునిక వసతులతో జిమ్, ఇండోర్ స్టేడియం, స్పా, షాపులు వంటి సదుపాయాలతో హ్యాపీనేస్ట్‌ను అభివృద్ధి చేయనున్నారు.

## ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఐఏఎస్‌ల భవనాలు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఐఏఎస్ అధికారుల నివాసాల కోసం భారీ బహుళ అంతస్తుల భవన సముదాయాల నిర్మాణాల బ్యాలెన్స్ పనులను రూ.452.30 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు. స్టిల్ట్ + 12 అంతస్తులతో కూడిన మొత్తం 18 టవర్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. 432 అపార్ట్‌మెంట్లు సమకూరుతాయి. 30 శాతానికి పైగా ఉన్న బ్యాలెన్స్ పనులను పూర్తి చేయాలి.

## మంత్రులు, జడ్జీల బంగ్లాలు

మంత్రులు, హైకోర్టు న్యాయమూర్తుల కోసం గవర్నమెంట్ కాంప్లెక్స్ ఏరియాలో రూ.419.07 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 1 విధానంలో 5,82,161 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొత్తం 71 బంగ్లాల బ్యాలెన్స్ పనులు చేపట్టనున్నారు.

## ఐకానిక్ అసెంబ్లీ

అమరావతిలో తాత్కాలిక అసెంబ్లీ స్థానంలో శాశ్వత ప్రాతిపదికన రూ.617.33 కోట్లతో ఐకానిక్ అసెంబ్లీ భవన నిర్మాణం చేపడుతున్నారు. బేస్‌మెంట్+గ్రౌండ్+3 ఫ్లోర్లతో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో, అత్యుత్తమ ఆర్కిటెక్చరల్ డిజైన్‌తో నిర్మిస్తున్నారు. భవిష్యత్తులో ఈ అసెంబ్లీని సందర్శనీయ ప్రాంతంగా అందుబాటులోకి తీసుకువస్తారు.

## ఐకానిక్ హైకోర్టు

రాజధానిలో తాత్కాలిక హైకోర్టు స్థానంలో శాశ్వత ప్రాతిపదికన ప్రపంచస్థాయి ఆర్కిటెక్చరల్ డిజైన్లతో ఐకానిక్ హైకోర్టు భవనాన్ని రూ.786.05 కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. బేస్‌మెంట్+గ్రౌండ్+7 ఫ్లోర్లతో రాఫ్ట్ టెక్నాలజీతో నిర్మించనున్నారు. దీన్నీ సందర్శనీయ ప్రాంతంగా అందుబాటులోకి తెస్తారు.

# అమరావతి 2.0

# ఏపీ రాజధానికి నవశకం

## అమరావతిలో ఐటీ టవర్

అమరావతిలో ఎల్ అండ్ టీ సంస్థ ఐటీ టవర్ నిర్మించబోతోంది. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను నెలకొల్పనుంది. అదే విధంగా... ఐబీఎం, టీసీఎస్, ఎల్ & టీ సంస్థల భాగస్వామ్యంతో క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యాలీని ఏర్పాటు చేయబోతున్నారు. మరోపక్క ప్రభుత్వం సీఐఐతో కలిసి గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ ను ఏర్పాటు చేస్తోంది. ఇదే సమయంలో రైతులకు పరిహారం కాకుండా అభివృద్ధి చేసిన స్థలాలను కేటాయించి.. రాజధాని అభివృద్ధి ఫలాలను వారికి అందేలా చేసింది.

## రాజధానికి రైలు

ఇదే సమయంలో... రాజధాని అమరావతికి రైలు సౌకర్యం కల్పించడాన్నికి ఎర్రుపాలెం - నంబూర్ మధ్య 56.53 కి.మీ. మేర రైల్వే లైన్ నిర్మాణానికి రైల్వే బోర్డు రూ.2,047 కోట్లు మంజూరు చేసింది. అదేవిధంగా... 189.4 కి.మీ. పొడవున అమరావతి అవుటర్ రింగ్ రోడ్ (ఏ.ఓ.ఆర్.ఆర్.)ను రూ.16,310 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం ఆమోదించింది. దీనికి సంబంధించిన ఖర్చును భరించేందుకు కేంద్రం ముందుకు వచ్చింది. ఇదే సమయంలో... కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజైన్ (ఎన్.ఐ.డీ.) త్వరలో పూర్తిస్థాయి తరగతులు ప్రారంభించనుంది.



**ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఐఏఎస్‌ల బంగ్లాలు**

వివిధ శాఖల విభాగాధిపతులైన ప్రిన్సిపల్ సెక్రటరీలు, ఐఏఎస్ అధికారుల కోసం రాయపూడి గ్రామంలో రూ.429.23 కోట్ల వ్యయంతో జీ ప్లస్ 1 విధానంలో 5,90,761 చదరపు అడుగుల విస్తీర్ణంలో 115 బంగ్లాల బ్యాలెన్స్ పనులను చేపట్టనున్నారు.

**రూ.15వేల కోట్ల వ్యయంతో**

రాజధాని కోసం పైసా ఆశించకుండా భూములు ఇచ్చిన రైతులకు నివాస, కమర్షియల్ రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం అందిస్తోంది. ఈ లే అవుట్లను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేయనుంది. రోడ్లు, డ్రెయిన్లు, నీటి సరఫరా, సీవరేజ్, యుటిలిటీ డక్ట్స్, రీయూజ్ వాటర్ లైన్స్ వంటి పనులు చేపట్టనుంది. వివిధ జోన్లలో దాదాపు 15 వేల కోట్ల వ్యయంతో ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులు పెద్ద ఎత్తున చేపడుతోంది.

**ఐకానిక్ సచివాలయ టవర్లు**

రాష్ట్రానికి ప్రధాన పరిపాలన కేంద్రమైన సచివాలయం కోసం జీ ప్లస్ 40 విధానంలో రూ.4,668 కోట్ల వ్యయంతో ఐకానిక్ సచివాలయ టవర్ల నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ టెండర్లు పిలిచింది. మొత్తం 5 టవర్లను డయాగ్రిడ్ విధానంలో చే పట్టనున్నారు. ఇందులో నాలుగు టవర్లను బేస్‌మెంట్ + 39 అంతస్తులు + టెర్రస్ గాను, ముఖ్యమంత్రి ఉండే టవర్‌ను మాత్రం బేస్‌మెంట్ + 47 ఫ్లోర్లు + హెలిప్యాడ్‌తో నిర్మించనున్నారు.

**వరద నివారణ పనులు**

రాజధానిలో వరద సమస్యను శాశ్వతంగా నివారించటానికి వీలుగా రూ. 5,944.26 కోట్ల వ్యయంతో మొత్తం 13 ప్యాకేజీలలో పనులు చేపట్టనున్నారు. కొండవీడువాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ విస్తరాభివృద్ధితో పాటు నీరుకొండ రిజర్వాయర్, ఇతర రిజర్వాయర్ల నిర్మాణం, పంపింగ్ స్టేషన్ల నిర్మాణం, వరదనీటి మళ్లింపు కాల్వలు, సంబంధిత ఇతర పనులను చేపట్టనున్నారు. రాజధానిలో రోడ్లు, కేబుల్స్ రహిత డక్ట్స్, సైకిల్ ట్రాక్స్, ఈ6, ఈ5, ఈ7, ఈ11, ఈ13, ఈ15, ఎన్13, ఈ2, ఈ4, ఎన్8, ఎన్4, ఈ10, ఈ12, ఎన్7 రోడ్లకు సంబంధించిన పునరుద్ధరణ పనులను రూ.9,150 కోట్ల వ్యయంతో చేపట్టనున్నారు.

**రోడ్డు అనుబంధ పనులు**

రాజధానిలో ప్రధాన రోడ్లకు సంబంధించి సీఆర్‌డీఏ టెండర్లు ఖరారు చేసింది. వీటిలో ఈ13, ఈ15 రోడ్ల బ్యాలెన్స్ పనులతో పాటు వీటిని ఎన్‌హెచ్ 16కు అనుసంధానించటానికి వీలుగా రూ.700 కోట్ల వ్యయంతో పనులు చేపట్టనున్నారు. దీంతో ఎన్‌హెచ్ 16 మీదుగా నేరుగా అమరావతిలోకి ప్రవేశించవచ్చు.


**ఈసారి పక్కా ప్లానింగ్**

రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి సంబంధించిన అన్ని పనులూ ఏకకాలంలో చేపట్టేలా రూ.77,250 కోట్లతో అంచనాలు సిద్ధం చేసింది.. ఇదే క్రమంలో రూ.49,000 కోట్ల పనులకు టెండర్లు ఖరారు చేసింది. రాజధాని నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తోంది. ఎట్టిపరిస్థితుల్లోనూ వీలైనంత తొందరగా పని పూర్తి చేయాలని ఫిక్సయ్యింది.

## ఔటర్ రింగ్ రోడ్డు పై కారు బోల్తా ఒకరి మృతి

### మృతుడు నల్లవెల్లి గ్రామానికి చెందిన వ్యక్తి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఔటర్ రింగ్ రోడ్డు పై కారు బోల్తా కొట్టి ఒకరు మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం ఉదయం ఔటర్ రింగ్ రోడ్డు పై బొంగులూరు ఎగ్జిట్ 12 సమీపంలో, అతి వేగంగా వచ్చిన ఓ కారు ప్రమాదానికి గురై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న యాచారం మండలం, నల్లవెల్లి గ్రామానికి చెందిన, దేరంగుల తిరుమలేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఇబ్రహీంపట్నం మార్చురీకి తరలించారు.



## విశ్వంలోనే మొట్టమొదటి పాత్రికేయుడు, ఖగోళ జర్నలిస్ట్ నారద మహర్షి

### ప్రభుత్వం తర్వాత అత్యంత శక్తివంతమైన స్థానంలో మీడియా రంగం, పాత్రికేయులు

సమాజ నిర్మాణంలో పాత్రికేయుల పాత్ర కీలకం..

తెలంగాణప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నాసత్యనారాయణరెడ్డి.

**కరీంనగర్, మహా:** ముల్లోకాలు సంచరించి లోకకళ్యాణం కోసం సమాచార రంగాన్ని వికసింపజేసిన మొట్టమొదటి పాత్రికేయుడు, ఖగోళ జర్నలిస్ట్ నారద మహర్షి అని తెలంగాణ ప్రాంత గ్రామ వికాస ప్రముఖ్ జిన్నా సత్యనారాయణరెడ్డి తెలిపారు. సమాచార భారతి కరీనగర్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పట్టణంలోని వాగేశ్వరి డిగ్రీ, పీజీ కళాశాలలో దేవర్షి నారద జయంతి (జర్నలిస్ట్ దినోత్సవం) వేడుకను నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, వక్తగా హాజరైన ఆయన మాట్లాడుతూ నారద మహర్షి విశ్వంలోని అన్నిలోకాలు సంచరించి అక్కడి మాటలు ఇక్కడా, ఇక్కడి మాటలు అక్కడ చేరవేయడమే ప్రవృత్తిగా ధర్మరక్షణ, సమాజ సంక్షేమం, లోక కళ్యాణం కోసం సమాచార రంగాన్ని వికసింపజేశారని పేర్కొన్నారు. విశ్వమంతట సమాచారాన్ని ప్రసారం చేసిన మొట్టమొదటి కమ్యూనికేటర్, దివ్య జర్నలిస్ట్ నారద మహర్షి యేనన్నారు. నారద మహర్షిని మొట్టమొదటి పాత్రికేయుడుగా పరిగణిస్తూ ప్రతి సంవత్సరం నారద జయంతిని ప్రపంచ పాత్రికేయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. సమాచార భారతి ఆధ్వర్యంలో నారద మహర్షి యొక్క ప్రాముఖ్యత, పాత్రికేయ రంగం యొక్క పాత్ర, జాతీయవాద అవగాహన గురించి తెలియజేయడానికి ప్రతి ఏటా వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.



### హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమానికి సంబంధించిన

## గోడ ప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గంగుల

**కరీంనగర్, మహా:** కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలో ఈనెల 11వ తారీకున శ్రీసీతరామ భక్త హనుమాన్ సహిత దేవాలయంలో నూట ఎనిమిది సార్లు హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాన్ని చేపట్టానున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజున కరీంనగర్ ఎమ్మెల్యే గంగులను వారి క్యాంపు కార్యాలయంలో చాలీసా పారాయణ బృంద సభ్యులు పెరుమాండ్ల కమల్ గౌడ్ ఆధ్వర్యంలో హనుమాన్ దీక్ష స్వాములు నేడు ఎమ్మెల్యే గంగులను కలిశారు. చాలీసా పారాయణ కార్యక్రమానికి రావలసిందిగా వారిని ఆహ్వానించారు. అనంతరం హనుమాన్ మాలధారణ స్వామి పెరుమాండ్ల కమల్ గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన పారాయణానికి సంబంధించిన గోడప్రతులను ఎమ్మెల్యే గంగుల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల వెంట నగర బి ఆర్ ఎస్ అధ్యక్షులు చల్ల హరిశంకర్, కరీంనగర్ ఫ్యాక్స్ చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, మాజీ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, మాజీ సర్పంచులు జింక సంపత్, నాయిని ప్రసాద్, శేఖర్ రావు, గురు స్వాములు రమణాచార్యులు, తిరుపతిగౌడ్, కమల్ గౌడ్ మరియు హనుమాన్ మాలాదారుల బృందం పాల్గొన్నారు.



## సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, మహా:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. సీతారాంపూర్ లోని ఐ.వి.వై పాఠశాలలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్ క్యాంపును శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు వివిధ రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఐ. వి. వై పాఠశాల సహకారంతో 40 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 30 రోజుల పాటు కంప్యూటర్ అప్లికేషన్స్ లో ఉచిత శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఇంకా ఎక్కువ మంది విద్యార్థులు వస్తే మరో బ్యాచిలో శిక్షణ ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని అన్నారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో థియరీ, ప్రాక్టికల్స్ పై దృష్టిపెట్టి విజయవంతంగా కోచింగ్ పూర్తి చేయాలనీ సూచించారు. ఇప్పుడు నేర్చుకున్న నైపుణ్యం భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కోఆర్డినేటర్ అశోక్ రెడ్డి, ఐ.వి.వై స్కూల్ చైర్మన్ పసుల మహేష్, కో చైర్మన్ శ్రీపాల్ రెడ్డి పాల్గొన్నారు.



## అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

**తొర్రూర్ ,మహా;** మే నెల 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు విద్యుత్ భద్రత వారోత్సవాలను ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తున్నామని తొర్రూరు డివిజనల్ ఇంజనీర్ జి. మధుసూదన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రోజున నాంచారి మడూర్ గ్రామంలోని రైతు వేదికలో విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టెక్నికల్ డివిజనల్ ఇంజనీర్ & సేఫ్టీ ఆఫీసర్ పెద్ది రాజం మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు మరియు వినియోగదారులు తీసుకోవలసిన అన్ని రకాల జాగ్రత్తలు మరియు సూచనలు విపులంగా తెలియజేశారు. తొర్రూరు డివిజనల్ ఇంజనీర్ జి. మధుసూదన్ మాట్లాడుతూ 202425 సంవత్సరంలో తొర్రూరు డివిజన్ పరిధిలో జరిగిన విద్యుత్ ప్రమాదాల వల్ల 16 మంది మనుషులు మరియు 30 జంతువులు చనిపోయినట్లుగా గుర్తించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రమాదాలకు గల కారణం రైతులు వినియోగదారులు విద్యుత్ పట్ల అప్రమత్తంగా వ్యవహరించకపోవడం వల్లే జరుగుతున్నాయని కావున నిత్యావసరమైన విద్యుత్ వినియోగించుకుంటున్నప్పుడు అన్ని రకాలుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా ఇళ్లలో బట్టలు ఆరేసుకోవటానికి బిగించుకునే జి.ఐ. వైర్లు పై కప్పుగా వేసుకునే ఇనుప రేకులకి షార్ట్ సర్క్యూట్ అయ్యి కొన్ని ప్రమాదాలు జరిగాయని అలాగే ఆకేరు వాగు వెంట ఉన్న గ్రామాల్లోని చాలామంది యువకులు చేపలు పట్టడానికి విద్యుత్తును వినియోగించడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. అలాగే రైతులు తమ పొలం చుట్టూ జంతువుల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి బిగించుకునే విద్యుత్ కంచె వలన కూడా ప్రమాదాలు జరిగి మరణిస్తున్నారని ఈ విధంగా చేయటం చట్ట ప్రకారం నేరమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తొర్రూరు అసిస్టెంట్ డివిజినల్ ఇంజనీర్ సి.ఎస్. చలపతిరావు, చిన్న వంగర తొర్రూరు అసిస్టెంట్ ఇంజనీర్లు విద్యుత్ సిబ్బంది రైతులు వినియోగదారులు పాల్గొన్నారు.




# ఇందిరమ్మ ఇండ్లు 600 చదరపు అడుగులకు మించొద్దు

## ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో 500 ఇండ్లు

### ఈనెల 5 నుంచి 20 వతేదీ వరకు 28 మండలాల్లో భూభారతి.. నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**కరీంనగర్, మహా:** ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ. హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌ఛార్జి మంత్రుల నుంచి లబ్ధిదారుల జాబితాకు ఆమోదం తీసుకోవాలని అలాగే ప్రతి నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతంలో కనీసం 500 ఇండ్లను కేటాయించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం నాడు చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణ రావుతో కలిసి భూ భారతి, ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్ల పై జిల్లా కలెక్టర్ లు, ఎస్.పి లతో మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రిగారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణం 400 చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మాణం జరిగేలా కలెక్టర్లు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనర్హులని తేలితే ఇండ్ల నిర్మాణం మధ్యలో ఉన్నాకూడా రద్దు చేస్తామన్నారు.




లిస్ట్ 1, లిస్ట్ 2 , లిస్ట్ 3 లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలన్నారు.

**5 నుంచి 20వ తేదీవరకు..**

గత నెల 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నాలుగు మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5వ తేదీ నుంచి 20వ తేదీవరకు జిల్లాకొక మండలం చొప్పున 28 జిల్లాల్లోని 28 మండలాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. పైలెట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని , పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని కలెక్టర్లకు సూచించారు. 605 మండలాలకు గాను ఇప్పటి వరకు 590 మండలాల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరిగిందని ఇందులో 85,527 మంది పౌరులు, 1,62, 577 మంది రైతులు పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలని, అసైన్డ్ ల్యాండ్‌లకు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టాఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలని సూచించారు.


**నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు**

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈనెల 4వ తేదీన జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది రాష్ట్రం నుండి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నారని ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల్లో త్రాగునీరుతోపాటు ఓ ఆర్ ఎస్ ప్యాకట్లు, మెడికల్ కిట్ లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన సూచనలను ముందుగానే ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. కరీంనగర్ కలెక్టరేట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరైన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అన్ని మండలాల్లో భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. 10 వేల 568 ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులకు సంబంధించి విచారణ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను పాదరదర్శకంగా ఎంపిక చేస్తున్నామని, పేదలలో అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. ఈ నెల 4న జరిగే నీట్ పరీక్షల కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 7 పరీక్ష కేంద్రాల్లో 2975 మంది నీట్ పరీక్ష రాస్తున్నట్లు వివరించారు. ఈ కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్పేయి, డిఆర్వో వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలి

### భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**శాయంపేట, మహా :** రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలనీ భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామంలో ఐకేపీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు.ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట మండల కాంగ్రెస్ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.



## పద్మశాలీలు అన్ని రంగాలలో రాణించాలి

### భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు

**శాయంపేట, మహా :** పద్మశాలీలు అన్ని రంగాలలో రాణించాలని,రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు.శాయంపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం( టిఆర్పిఎస్) శాయంపేట మండల అధ్యక్షులు సామల మధుసూదన్ అధ్యక్షతన మండల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం జరగగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. కార్యక్రమం లో ముందుగా అధ్యక్షులు సామల మధుసూదన్ ఎమ్మెల్యేను ఆహ్వానించి పూల బొకే అందించి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు.ప్రత్యేక తెలంగాణ కోసం జరిగిన తొలి,మలి దశ పోరాటాల్లో కీలక పాత్ర పోషించడంతో పాటు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి కొండా లక్ష్మణ్ బాపూజీ అని,ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శప్రాయమని, శాయంపేట మండల కేంద్రంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు తన వంతుగా సహకారం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అన్ని గ్రామాల నుండి పద్మశాలి కులస్తులు పాల్గొన్నారు.




## విద్యార్థులకు ఉత్తమ విద్యను అందిస్తున్న ప్రభుత్వ కళాశాలలు

**వరంగల్ మహా;** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఉత్తమ విద్య విధానాన్ని అమలు చేస్తూ ప్రభుత్వ విద్యాసంస్థలలో విద్యను అభ్యసించిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి కొండ సురేఖ మరి సందర్భాల్లో అన్నారు. మెరుగైన విద్యా విధానం పై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయింపు విద్యార్థుల భవిష్యత్తు తల్లిదండ్రులకు బాసటగా నిలిస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాల కిల వరంగల్ లో గత 21 సంవత్సరాలుగా ప్రైవేట్ విద్యా సంస్థలకు దీటైన ఫలితాలను అందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు బాసటగా నిలుస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కిలా వరంగల్ లోని విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులను ప్రోత్సహిస్తూ వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాంటెస్టెండ్ కార్పొరేటర్ బెడద వీరన్న 37వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయిని దూడయ్య యాదవ్ డివిజన్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వారి సిబ్బంది శ్రీనివాస్, సురేందర్ రెడ్డి, రాములు, సిహెచ్ రాజు, కె ప్రసాద్, శుక్లాంబరం, రజిత జి రాజేందర్, వి వేణు, స్థానిక నాయకులు సిరబోయిన కిరణ్ తగరపు సాగర్ బరిగెల ప్రభాకర్ పాల్గొన్నారు. అనంతరం బెడద వీరన్న మాట్లాడుతూ ఇప్పుడున్న విద్యా వ్యవస్థలో ప్రైవేట్ కళాశాలలో పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయడం మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసుకొని కాలేజీలకు పేరు వచ్చే విధంగా చేసుకోవడమే తప్ప విద్య వ్యవస్థ పై అవగాహన లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక విద్య విషయంలో ప్రత్యేక చొరవతో ప్రభుత్వ కళాశాలలో మీ పిల్లలను చేర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్యులు కొండా సురేఖ పిలుపుమేరకు ప్రభుత్వ కళాశాలలో పిల్లలకు నాణ్యమైన విద్యను అందిస్తూ గత 21 సంవత్సరాలుగా ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ విద్యను అందిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తున్న ఈ ప్రభుత్వ జూనియర్ కళాశాల కిల వరంగల్ లో మీ పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవాలని ప్రభుత్వ కళాశాలలో చదువుకున్న పిల్లలకు క్రమశిక్షణతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని దీనిని దృష్టిలో ఉంచుకొని మీ పిల్లలను కిలా వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ఆయన కోరారు.



## నీట్ పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు

### వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్

**హన్మకొండ మహా;** ఈ నెల 4వ తేదీ ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల నుండి 5 గంటల వరకు జరగనున్న నీట్ ప్రవేశ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 13 పరీక్షా కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వరంగల్, హన్మకొండ కలుపుకొని 11, జనగాం 2 ఉన్నాయి. ఈ ప్రవేశ పరీక్షకు మొత్తం 5,260 మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారు. ఇందులో వరంగల్, హన్మకొండ పరిధిలో 4680 మంది విద్యార్థులు పరీక్ష రాస్తుందగా, జనగామ జిల్లాలో 580 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారు, ముఖ్యంగా మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష జరిగే కేంద్రాల వద్ద పటిష్టమైన ఏర్పాట్లు చేయడం జరిగిందని అలాగే పరీక్షా కేంద్రాల వద్ద 163 బి ఎన్ఎస్ఎస్ అమలులో ఉంటుంది. కావున పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ఊరేగింపులు, ర్యాలీ లు, ధర్నాలు, గుంపులు తిరగడం నిషేధిచబడ్డాయని, పరీక్ష పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.



## ఆర్టీసీలో ఐఎన్ టీయూసి జెండా ఎగరెయ్యాలి

### ఆదిలాబాద్ ఆత్మీయ సమ్మేళనంలో రాష్ట్ర నాయకుల పిలుపు

**ఆదిలాబాద్ మహా :** రానున్న ఆర్టీసీ ట్రేడ్ యూనియన్ ఎన్నికలలో ఐఎన్ టీయూసీ జెండా ఎగరాలని రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు సయ్యద్ మహమూద్ ఆకాంక్షించారు.శుక్రవారం పట్టణంలోని తరంగిణి ఫంక్షన్ హాల్లో జరిగిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశంలో ఐఎన్ టీయూసీ జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. స్టేట్ జనరల్ సెక్రటరీ గా జక్కుల మల్లేషం ను ఎన్నుకున్నట్టు తెలిపారు.వచ్చే ఎన్నికలలో ఆర్టీసీ లో ఐఎన్ టీయూసీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు.రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ ముఖ్య పదవుల్లో ఉండకూడదని సర్వీస్ లో ఉన్న వాళ్లకు మాత్రమే అధ్యక్ష,కార్యదర్శుల్లాంటి పదవులు కేటాయించాలని ఆయన సూచించారు. అలాగే సమ్మెకిది సమయం కాదని ప్రభుత్వానికి కొంత సమయమిద్దామని సూచించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దేవిదాస్ చారి పట్టణ అధ్యక్షులు గుడిపల్లి నగేష్, ఆర్టీసీ ఐఎన్ టీయూసీ నాయకులు ఆఫీస్ ఖాన్, సురేందర్.భాస్కర్ ,శ్రీదేవి తదితరులు పాల్గొనాలి.




### రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి

## చిత్ర పటాలకు పాలాభిషేకం



**ఆదిలాబాద్ మహా :** కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణన చేపట్టేందుకు ముందుకు వచ్చిందని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ లు పేర్కొన్నారు.శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులతో కలిసి బోథ్ నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు చేపట్టిన పాదయాత్రలో ప్రజలనుండి స్వీకరించిన ఆర్జీలతోనే కులగణన చేపట్టాలని డిమాండ్ చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన కులగణన చూసి దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు ప్రకటన చేయడం గర్వకారణం అన్నారు.ఏదైనా దేశానికి ఆదర్శంగా రేవంత్ రెడ్డి పాలనా కొనసాగుతుందని ఇలాంటి ముఖ్యమంత్రి మన రాష్ట్రానికి ఉండటం ప్రజలందరి అదృష్టం అని అన్నారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సొసైటి డైరెక్టర్ చట్ల ఉమేష్, సీనియర్ నాయకులు మహమ్మద్, గంగాధర్,షేక్, షాకీర్ అబుద్,సురేందర్, గడ్డల నారాయణ, వంశీ, అబ్బు, ఉమేష్ తదితరుల పాల్గొన్నారు.

### కేంద్ర ప్రభుత్వం కులగణన చేయాలనే


## నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

### దేశ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు

### జనగణనతో పాటు కులగణన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి

### ఆదిభట్ల మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు శిగ వీరస్వామి గౌడ్

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణనను చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని శిగ వీరస్వామి గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన పేరుతో తప్పుల తడకగా బీసీ గణన చేసి ఇతరులను బీసీలలో చూపించడంతో కేంద్ర ప్రభుత్వం గమనించి తప్పుడు కులగణను ఒప్పుకునేది లేదని, దేశవ్యాప్తంగా ఏ విధమైన అవకతవకలు లేకుండా కేంద్ర కేబినెట్ కులగణనకు అంగీకారం తెలపడం హర్షణీయమన్నారు. అయితే ఇప్పటికే జనగణన ఆలస్యమైన నేపథ్యంలో ప్రజలకు సంక్షేమం అందదండలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అందుకే వీలైనంత తొందరగా జనగణనతో పాటు కులగణన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి జనాభా ప్రాతిపదికన సంక్షేమ ఫలాలు, రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు.



# పురుమల్లపై తక్షణమే వేటు వేయండి

## పురమల్ల శ్రీనుపై పీసీసీ అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన కరీంనగర్ కాంగ్రెస్ నేతలు..

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు.. మహేశ్ కుమార్ మార్ గౌడ్..



**కరీంనగర్ మహా:** గత నెల 28వ తేదీన కరీంనగర్లో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా నిర్వహించిన సన్నాహక సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పై కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి పురుమళ్ల శ్రీనివాస్ పరోక్షంగా దూషణలకు దిగిన అంశంపై ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, పార్టీ పరిశీలకులు, ముఖ్యనేతల నుంచి నివేదిక తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ కరీంనగర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలకు హామీ ఇచ్చారు. పార్టీ పరువు తీసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. పార్టీ పరువు బజారుకు ఈడ్చే వారిపై, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్లో ఉంటూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ, బీజేపీ, బీఆర్ఎస్తో లోపాయికార ఒప్పందం చేసుకొని మంత్రి పొన్నం ప్రభాకర్పై దూషణలకు దిగుతూ, పార్టీ పరువు తీస్తున్న పురుమళ్లను శ్రీనివాస్ను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు నేతృత్వంలో కరీంనగర్ జిల్లాకు 200 మంది కాంగ్రెస్ ముఖ్యనేతలు పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ముఖ్యనేతలు 200 మంది స్వచ్ఛందంగా మూకుమ్మడిగా సంతకాలు సేకరించి హైదరాబాద్ లోని గాంధీభవన్కు తరలివెళ్లారు. వెలిచాల రాజేందర్ రావు అధ్వర్యంలో కాంగ్రెస్ ముఖ్యనేతలు గాంధీభవన్లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్ను కలిశారు. మంత్రి పొన్నంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పురుమళ్ల శ్రీనివాస్ను వెంటనే బహిష్కరించాలని, తద్వారా పార్టీని బలోపేతం చేయాలని విన్నవించారు. ఈ సందర్భంగా పురుమళ్ల వ్యవహారం పై పీసీసీ అధ్యక్షుడితో సుదీర్ఘంగా చర్చించారు. గత నెల 28వ తేదీన జరిగిన సమావేశంలో పురుమళ్ల మంత్రి పొన్నంపై చేసిన అనుచిత వ్యాఖ్యలు, దూషణలు, మంత్రిపై అక్కసు వెళ్లగక్కుతున్న వైనం.. ఆయనతో పార్టీకి జరుగుతున్న నష్టం.. తదితర అంశాలను ముఖ్యనేతలు మహేశ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకొచ్చారు. అన్ని విషయాలను పీసీసీ అధ్యక్షుడు ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలతో పీసీసీ అధ్యక్షుడు మాట్లాడారు. పురుమళ్ల వ్యవహారాన్ని పార్టీ నేతల నుంచి తెలుసుకున్నానని, వెలిచాల రాజేందర్ రావు తన దృష్టికి తీసుకొచ్చారని, పూర్తి వివరాలతో నివేదిక తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. మీరు ఏలాంటి ఆందోళన చెందవద్దు.. పార్టీలో అధిష్టానమే సుప్రీం.. వారి ఆదేశాలను పాటించాలని సూచించారు. బహిరంగంగా విమర్శలు చేస్తూ పార్టీ పరువు తీసే వారిని ఉపేక్షించమని, సీనియర్ నేత, మంత్రి పొన్నం ప్రభాకర్పై శ్రీనివాస్ వ్యక్తిగతంగా దూషణలకు దిగడం పద్దతి కాదని, ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి సానుకూలంగా చర్చించుకుంటే బాగుంటుందని తెలిపారు. ఇలా వ్యవహరించడం బాగా లేదని, శ్రీనివాస్ తీరు సరిగా లేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, మరో వైపు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పీసీసీ అధ్యక్షుడు నేతలకు సూచించారు.

**పురుమళ్ల పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తున్నారు.. కాంగ్రెస్ ముఖ్యనేతలు..**

పురుమళ్ల శ్రీనివాస్ వ్యవహారం రోజు రోజుకు శృతి మించుతున్నదని, బీజేపీ, బీఆర్ఎస్తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకొని పార్టీలోనే ప్రతిపక్ష నేతలాగా వ్యవహరిస్తున్న తీరు విస్మయం కలుగుతున్నదని పీసీసీ అధ్యక్షుడి దృష్టికి కాంగ్రెస్ నేతలు తీసుకొచ్చారు. కరీంనగర్లో కాంగ్రెస్ పరిస్థితి దారుణంగా మారిందని, శ్రీనివాస్ వ్యవహరిస్తున్న తీరుతో పార్టీ పెద్దలే తలలు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. గత నెల 28వ తేదీ సోమవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా సన్నాహక సమావేశం జరిగిందనీ, దీనికి ముఖ్య అతిథులుగా ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, పార్టీ పరిశీలకులు, ఇతర ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారని వివరించారు. పురుమళ్ల శ్రీనివాస్ కుట్రపూరితంగా అలజడి సృష్టించేందుకు హాజరై మంత్రి పొన్నంపై పరోక్షంగా దుర్భాషలాడారని పేర్కొన్నారు. సమావేశానికి వచ్చిన ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకులు, పార్టీ పెద్దల ముందే పార్టీ లైన్ దాటి తమరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దీంతో అక్కడ ఉన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే శ్రీనివాస్పై తిరగబడ్డారని తెలిపారు. ఇప్పటికే పార్టీ పెద్దలు ఆయనకు రెండు సార్లు షోకాజ్ నోటీస్ అందించారని, అయినా ఆయనపై ఏలాంటి చర్య మాత్రం తీసుకోలేదనీ, పట్టపగ్గాల్లేకుండా నీచంగా పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని విన్నవించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్కు శ్రీనివాస్ అమ్ముడు పోయారని ఫిర్యాదు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్తో లోపాయికార ఒప్పందం చేసుకొని పార్టీకి నష్టం చేకూరుస్తున్నారని, ఇలాంటి వ్యక్తిని వెంటనే పార్టీ నుంచి తక్షణం సస్పెండ్ చేయాలని కోరారు. లేకపోతే కరీంనగర్లో పార్టీకి భవిష్యత్ ఉండదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్, పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ జనద్ రహమాత్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ మడుపు మోహన్, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, కిసాన్ సెల్ జిల్లా చైర్మన్ పురం రాజేశం, జిల్లా గౌడ్ సంఘ అధ్యక్షులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, తాజా మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఆకుల నరసన్న నర్మదా, కోటగిరి భూమా గౌడ్, గంట కళ్యాణి శ్రీనివాస్, మల్లికార్జున రాజేందర్, పడిశెట్టి భూమయ్య, పత్తెమ్ మోహన్, మాచర్ల ప్రసాద్, మాజీ ఎంపీపీ సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, జక్కని ఉమాపతి బొమ్మ ఈశ్వర్ గౌడ్, బోనాల మురళి, గడ్డం శ్రీరాములు, మాచర్ల అంజయ్య గౌడ్, చెప్యాల శ్రీనివాస్ గౌడ్, తాళ్ల పెల్లి సంపత్ గౌడ్, బత్తిని చంద్రయ్య, అనరాసు కుమార్, కుంబాల రాజ్ కుమార్, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్ తో ప్రమాదానికి గురైన ఉపేందర్

### 40 శాతం కాలిన గాయాలతో హాస్పిటల్లో చేరిక

### చికిత్స అందిస్తున్న హిమగిరి హాస్పిటల్ డాక్టర్లు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** శుక్రవారం గచ్చిబౌలి ఫ్లై ఓవర్ దగ్గర విద్యుత్ పనులు చేస్తుండగా ఓ వ్యక్తికి ప్రమాదం జరిగింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలక్ట్రిక్ పనులు చేస్తుండగా వై ఉపేందర్ (23) అనే వ్యక్తికి విద్యుత్షాక్ తగిలి గాయాల పాలయ్యాడు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఉపేందర్, గచ్చిబౌలిలోని డెలిగేట్స్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ లో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించి ఫ్లైఓవర్ వద్ద ఎలక్ట్రికల్ పనులు చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానిక హిమగిరి హాస్పిటల్ కు తరలించిన తోటి సిబ్బంది, ప్రస్తుతం హాస్పిటల్ లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. 40% గాయాలతో హిమగిరి హాస్పటల్లో ఉపేందర్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై

# నిషేదాజ్ఞులు కొనసాగింపు

### కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్



**కరీంనగర్, మహా:** సాధారణ పౌరులు, ప్రధానంగా మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరీంనగర్ కమీషనరేట్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేదాజ్ఞలను ఈ నెల 31 వరకు పొడిగించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాధులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకోవడం జరిగిందని పేర్కొన్నారు. మద్యం సేవించి మద్యం ప్రియులు వీధుల్లో, రోడ్లపై అసభ్యపదజాలంతో మాట్లాడుతుడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించింది. మద్యంప్రియుల ఆగడాలకు కళ్ళెం వేయడంతోపాటు ప్రజల భద్రత, రక్షణ కోసం ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాల పరిమితి పొడిగించబడే అవకాశం ఉంది. ఐపిసి 188. హైదరాబాద్ నగర పోలీసు చట్టం, ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేదాజ్ఞలు ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

## అక్రమ విద్యుత్ మీటర్లను సీజ్ చేసిన రాయదుర్గం పోలీసులు

### ఏడీఈ అంబేద్కర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు

### అక్రమానికి పాల్పడ్డ కాంట్రాక్టర్ చెన్నకేశవరెడ్డి పై కేసు నమోదు



**రంగారెడ్డి జిల్లా సమితి మహా:** గచ్చిబౌలి టెలీకామ్ నగర్ లోని ఓ ఇంట్లో అక్రమంగా దాచిన 42 విద్యుత్ మీటర్లను సీజ్ చేసిన రాయ దుర్గం పోలీసులు. విద్యుత్ కార్యాలయం నుండి మంజూరు అయిన సర్వీస్ లకు సంబందించిన మీటర్లు ప్రైవేట్ వ్యక్తి ఇంట్లో దొరకటం పై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అక్రమంగా మీటర్లు దాచిన చెన్నకేశవరెడ్డి అనే వ్యక్తిపై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. రాయదుర్గం ఇన్స్పెక్టర్ వెంకన్న మాట్లాడుతూ... ఎలక్ట్రిసిటీ మీటర్లు కొన్ని కనిపించడం లేదంటూ ఇబ్రహీంబాగ్ ఏడీఈ అంబేద్కర్ రాయదుర్గం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు, గచ్చిబౌలి టెలికమ్ నగర్ లోని ఓ ఇంటిలో ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇన్స్ పెక్షన్ కు వెళ్ళినప్పుడు మీటర్లు అక్కడ లేవని కంప్లైంట్ ఇచ్చాడని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయగా మీటర్లు ఓ ఆటోలో తీసుకెళ్లినట్లు సీసీటీవీలో రికార్డ్ అయింది. చెన్న కేశవ రెడ్డి అనే కాంట్రాక్టర్ మీటర్లు అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించినట్లు తెలుసుకోవడం జరిగింది. మీటర్లను దాచిన ప్రాంతానికి వెళ్లి పరిశీలించి చూడగా సంచులలో 42 మీటర్లు గుర్తించినట్లు సిఐ వెల్లడించారు.. దొరికిన మీటర్లను సీజ్ చేసి, కాంట్రాక్టర్ చెన్నకేశవ రెడ్డిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో పేదలకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

### నల్లవెల్లి మాజీ ఎంపిటిసి ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నల్లవెల్లి గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మాజీ ఎంపీటిసీ ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్ పంపిణీ చేశారు. ప్రచారం మండలం నల్లవెల్లి గ్రామానికి చెందిన బాయికాడి యాదయ్య, బాయికాడి లక్ష్మమ్మ, కామిశెట్టి పెద్ద అంజయ్య, రత్నాల తరుణ్ ల కుటుంబ సభ్యులు, అనారోగ్యంతో హాస్పిటల్లో చేరి చికిత్స పొందిన అనంతరం బిల్లులను సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో వచ్చిన సిఎం సహాయ నిధి చెక్కులను మాజీ ఎంపిటిసి ఈదులకంటి లక్ష్మీపతి గౌడ్ బాధితులకు పంపిణీ చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కానమోని జంగయ్య, ఉపాధ్యక్షులు కాసాని వెంకటయ్య, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గొరిగె హరికిషన్, మండల సేవాదల్ ప్రదాన కార్యదర్శి సబావట్ కిషన్ నాయక్, గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కంబాలపల్లి రమేష్, ఎన్ఎస్యుఐ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి కాసాని శ్రావణ్ కుమార్, సబావట్ బిల్యా నాయక్, దాసరి వెంకయ్య, మహేష్, శివ, గణేష్, శేఖర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఎమినేంట్ స్కూల్ విద్యార్థి స్టేట్ ర్యాంకు

### తక్కువ ఫీజు తో ఉన్నతమైన విద్య అందించడమే తమ లక్ష్యం స్కూల్ చైర్మన్ V.V రామారావు



**బాలాపూర్ మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఫలితాలలో గాయత్రి నగర్, జిల్లెల్లగూడ ఎమినేంట్ హై స్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. 600 మార్కులకు గాను 590 మార్కులతో అన్వేష్ అనే విద్యార్థి స్టేట్ ర్యాంకు సాధించాడని ఎమినేంట్ స్కూల్ చైర్మన్ V.V రామారావు హర్షం వ్యక్తం చేశారు. పూజిత 571, చంద్ర సిద్ధార్థ 559, వైష్ణవి 552, హరికుమార్ 550, సిద్ధార్థ 534, హర్షిత 532, దీక్షిత 530, జోష్మిత 527, వైష్ణవి 527 మార్కులు సాధించారు. 500ల మార్కులకు పైగా 25 మంది విద్యార్థులు 100 కు 99% ఉత్తీర్ణతతో అత్యుత్తమ ప్రతిభను కనబరిచారని తెలిపారు. విద్యార్థుల ఉత్తీర్ణతే లక్ష్యంగా తక్కువ ఫీజులతో చక్కటి విద్యను అందించడమే ఎమినేంట్ హై స్కూల్ ప్రధాన లక్ష్యమన్నారు. ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు శాలువాలు, మోమెంటో, బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ v v రామారావు, స్కూల్ డైరెక్టర్లు అనిల్, కౌండిన్య, స్కూల్ ప్రిన్సిపల్ కోకిల రాణి ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రావిరాల పెట్రోల్ బంక్ పై గుర్తుతెలియని దుండగుల దాడి

### దాడిలో ధ్వంసమైన బంక్ కార్యాలయ అద్దాలు.. భయాందోళనలకు గురైన సిబ్బంది

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఆదిభట్ల పోలీసులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిది మహా:** ఆదిమాత పోలీస్ స్టేషన్ పరిధి, రావిర్యాలలోని శ్రీ లక్ష్మీ పెట్రోల్ బంక్ పై గుర్తుతెలియని దుండగులు దాడి చేశారు. గురువారం రాత్రి 12గంటల గంటల సమయంలో రంగారెడ్డి జిల్లా, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధి, ఓఆర్ఆర్ పక్కన ఉన్న, రావిర్యాల శ్రీ లక్ష్మీ బాలాజీ పెట్రోల్ బంక్ లో బాటిల్ తీసుకొని పెట్రోల్ కోసం ద్విచక్ర వాహనం పై వచ్చిన ముగ్గురు వ్యక్తులు, పెట్రోల్ బంక్ మూసి వేసామని సిబ్బంది సదరు వ్యక్తులకు తెలపడంతో, పెట్రోల్ బంక్ సిబ్బంది పై దాడికి పాల్పడుతున్న సమయంలో, సిబ్బంది ఆఫీస్ రూమ్ లోపలికి వెళ్లి డోర్ పెట్టుకోవడంతో, ఆగ్రహించిన దుండగులు పక్కనే ఉన్న సిమెంట్ ఇటుకలతో పెట్రోల్ బంక్ ఆఫీస్ రూమ్ అద్దాలను ధ్వంసం చేసి పారిపోయారు. వెంటనే ఆదిభట్ల పోలీసులకు సమాచారం ఇవ్వగా స్పందించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణ తర్వాత జాబ్ క్యాలెండర్ పరుగులు

### రామయ్య కోచింగ్ సెంటర్ ఆన్లైన్ బుక్స్ వెబ్ సైట్ ప్రారంభించిన డా. రియాజ్



**బాలాపూర్ మహా:** తెలంగాణ రాష్ట్రం లో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి కాగానే జాబ్ క్యాలెండర్ పరుగులు పెడుతుందని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డా. రియాజ్ అన్నారు. శుక్రవారం దిల్ షుఖ్ నగర్ లో రామయ్య కోచింగ్ సెంటర్ ఆన్లైన్ బుక్స్ వెబ్ సైట్ ను రామయ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ... ఉద్యోగాల కల్పన అనేది ఖర్చు తో కూడుకున్న వ్యవహారం కాదు అని భవిష్యత్తు నిర్మాణం గా ప్రభుత్వం భావిస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ, చిన్న, చిన్న టెక్నికల్ సమస్యలు దాటి జాబ్ క్యాలెండర్ త్వరలో రాబోతుందని, జూన్ రెండో తేదీన ప్రభుత్వము తీపికబురం అందించబోతుందన్నారు అని అన్నారు. విద్యార్థులు అవకాశాలని సద్వినియోగం చేసుకోవాలని, నిరుద్యోగులకు అవసరమయ్యే పుస్తకాలు గ్రంథాలయాల లో ఉన్నాయని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు కోరుకునే పుస్తకాలు, పుస్తక రూపంలో ఆన్లైన్ లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. గర్ గర్, గల్లి గల్లి, గావ్ గావ్ రీతిలో రామయ్య బుక్స్ ఆన్లైన్ లో గ్రూప్స్, పోలీస్, టేట్, డీఎస్సీ పరీక్షకు సంబంధించిన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రతి గ్రామం, ఊరు వాడ మారుమూల ప్రాంతంలో రామయ్య కోచింగ్ సెంటర్ ఆన్లైన్ బుక్స్ ను వెబ్ సైట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం రామయ్య కోచింగ్ సెంటర్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. నిరుద్యోగులు ఈ బుక్స్ వెబ్ సైట్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రామపంచాయతీ భవనాన్ని

# ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండల పరిధిలోని బోటి గూడ గ్రామంలో ఎంపీడీవో మున్ని, మాజీ జెడ్పిటిసి నిరటి తన్విరాజ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శుక్రవారం నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. రామాంజపుర్కు అనుబంధ గ్రామ పంచాయతీగా ఉన్న బోటి గూడ, నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడడంతో గ్రామస్తుల సౌకర్యార్థం నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ గ్రామస్తుల ఎన్నో ఏండ్ల బాధలు తీరాయి, వృద్ధులు, వికలాంగులు పింఛన్ డబ్బులకు రేషన్ బియ్యానికి అనుబంధ ఊరు అయిన రామాంజపూర్ వెళ్లే పరిస్థితి తప్పిందన్నారు. గ్రామస్తులు పట్టు పట్టి బోటి గూడను గ్రామ పంచాయితీగా ఏర్పాటుకు సహకరించిన గ్రామస్తులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తు ఎన్నికలలో పోటీకి తావివ్వకుండా గ్రామపంచాయతీకి సర్పంచ్ గా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలి, చిన్న గ్రామం స్వచ్ఛ గ్రామంగా ఉండి ఎన్నో అవార్డులు సాధించాలన్నారు. బోటి గూడ గ్రామస్తులు నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభించడంతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ని సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో సర్పంచ్గా తమ గ్రామం నుంచి వార్డు సభ్యులుగా తమ గ్రామస్తులే ఉంటారు. గ్రామపంచాయతీ కావలసిన మౌలిక వసతులను రెవెన్యూ సదుపాయాన్ని సమకూర్చాలని ఎమ్మెల్యే ప్రకాష్గౌడ్ కు విన్నవించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దవణాకర్ గౌడ్, వైస్ చైర్మన్ ప్రభు సాగర్, ఇన్చార్జ్ ఎంపీఓ, పంచాయితీ అధికారులు, నిరటి రాజు, కోటేశ్వర్ గౌడ్, ప్రవీణ్ యాదవ్, మహేందర్ ముదిరాజ్, దండు ఇస్తారి, నిరటి శేఖర్, బిక్షపతి, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ ఎయిర్పోర్ట్ అరవెల్స్ గేట్ నెంబర్ 2 వద్ద

# ప్రయాణికుడు ఆజాద్ సులేమాన్ మియా మృతి



**రాజేంద్రనగర్, మహా :** జార్ఖండ్ నుంచి ఇండిగో విమానంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ వచ్చిన ఆజాద్ సులేమాన్ మియా 47, తన కూతురు నాశ్రీన్ ఆజాద్ ను వెంట తీసుకొని కర్ణాటకలోని షహీన్ యూనివర్సిటీ బీదర్ ఇంటర్ సెకండియర్ చదువుతుంది, నిన్న గురువారం కూతుర్ని కర్ణాటకలోని షాహిన్ యూనివర్సిటీ బీదర్ తీసుకెళ్లేందుకు, రాంచి నుండి ఇండిగో విమానంలో 6E191 లో శంషాబాద్ ఎయిర్పోర్టు దిగి అరవెల్స్ పిలేరు నెంబర్ 2 దగ్గరికి రాగానే ఆజాద్ సులేమాన్ మియా కుప్పకూలి కింద పడిపోయాడు, వెంటనే అక్కడున్న ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో ఉన్న అపోలో ఆసుపత్రికి తరలించగా అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఎయిర్పోర్ట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## 10 తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఘన సన్మానం

### స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం టాపర్లకు దావత్ ఏర్పాటు చేసి వారితో భోజనం చేసిన కలెక్టర్ డాక్టర్ సత్య శారద




**వరంగల్ మహా;** ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పదవ తరగతి ఇంటర్మీడియట్ ఫలితాల్లో వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాల్లోని పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 45 మంది విద్యార్థులకు, అదేవిధంగా ఇంటర్మీడియట్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 20 మంది విద్యార్థులకు జిల్లా కలెక్టరేట్లో బుధవారం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో పాటు ప్రధానోపాధ్యాయులను కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగింది. వరంగల్ జిల్లా వ్యాప్తంగా విద్యార్థులలో పరీక్షల పట్ల భయం పారద్రోలి ప్రోత్సహించుటకు గాను ప్రత్యేకంగా రూపొందించిన స్ఫూర్తి కార్యక్రమం ద్వారా జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దావత్ ఇస్తానని చెప్పిన క్రమంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసి వారితో కలిసి కలెక్టర్ భోజనం చేశారు. ఈ సందర్భంగా జరిగిన విజయోత్సవ అభినందన సభలో కలెక్టర్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో కలసి కేక్ కట్ చేసిన అనంతరం విద్యార్థులను జ్ఞాపికలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పదవ తరగతి ఇంటర్మీడియట్ టాపర్లు, వారి తల్లిదండ్రులు అసాధారణమైన ప్రతిభ కనబడుచుటకు కష్టపడి సాధించిన లక్ష్యం, అనుభవాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున అందించాల్సిన సాయం తప్పకుండా అందిస్తామని పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు ప్రోత్సహిస్తూ వాళ్ళను ఉన్నత శిఖరాలకు చేరుకొనుటకు ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పిల్లలకు భవిష్యత్తులో తీసుకోవలసిన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకొనుటకు జిల్లాలో రిటైర్డ్ హెడ్మాస్టర్లు, అపార అనుభవం కలిగిన వారితో స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించినందున 10వ తరగతి ఉత్తీర్ణతలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు తీసుకు రాగలిగామని అన్నారు. చదువుకు ఎప్పటికీ ముగింపు ఉండదని, జీవితంలో పదిమందికి ఉపయోగపడేలా ప్రతి విద్యార్థి పనిచేయాలని అన్నారు. రానున్న భావితరాలకు ఆదర్శంగా నిలిచే విధంగా విద్యార్థులు నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, జెడ్పి సీఈవో రామ్ రెడ్డి డిఇఓ జ్ఞానేశ్వర్, డి ఆర్ డి ఓ కౌసల్యాదేవి వివిధ సంక్షేమ శాఖల అధికారులు విద్యార్థుల, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## బిల్‌గేట్స్‌కు అరుదైన వ్యాధి..



ప్రపంచ కుబేరులలో ఒకరు.. మైక్రోసాఫ్ట్ కో ఫౌండర్ 'బిల్‌గేట్స్' గురించి దాదాపు అందరికీ తెలుసు. కానీ ఈయనకు 'ఆస్పెర్గర్ సిండ్రోమ్' ఉందని, ఇది ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ కిందికి వస్తుందని ఆయన కుమార్తె ఫోబ్ గేట్స్ 'కాల్ హర్ డాడీ' పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. 'కాల్ హర్ డాడీ' పాడ్‌కాస్ట్ ఎపిసోడ్‌లో.. కనిపించిన ఫోబ్ గేట్స్, తన తండ్రిని కలవడానికి తన బాయ్‌ఫ్రెండ్‌లను ఇంటికి తీసుకువెళ్లిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. అయితే నాన్న వారిని కలవడానికి ఇబ్బందిపడేవారని, అది నాకు చాలా ఫన్నీగా అనిపించేది ఫోబ్ పేర్కొన్నారు నిజానికి బిల్‌గేట్స్.. గతంలో ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో, ఇప్పటి పరిస్థితుల్లో నేను పెరిగి ఉంటే నాకు ఖచ్చితంగా ఆస్టిజం ఉందని తేలేది. నాకు ఆస్టిజం ఉందా?.. లేదా? అని టెస్టులు చేయించుకోలేదు, డాక్టర్లు కూడా నాకు ఎప్పుడూ దీని గురించి చెప్పలేదు. అయితే నా ప్రవర్తన చిన్నప్పటి నుంచి అలా ఎందుకు ఉందో.. అమ్మానాన్నలకు అర్థమయ్యేది కాదు. అప్పట్లో ఇది ఒక వ్యాధి అని తెలుసుకోవడానికి టెక్నాలజీ కూడా అంత అభివృద్ధి చెందలేదు. ఒకసారి అమ్మానాన్నలు నన్ను (బిల్‌గేట్స్) ఓ థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లారు. ఆయన నా ప్రవర్తనను మార్చడానికి చాలా ప్రయత్నించారు. నా లోపాన్ని పాజిటివ్‌గా చూపించడంలో విజయం సాధించాడని పేర్కొన్నారు. wఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్: ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ ఉన్నవారు ఇతరులతో మాట్లాడాలన్నా.. కలవాలన్నా ఇబ్బంది పడుతుంటారు. అంతే కాకుండా వీరికి కొన్ని విషయాలపై అమితాసక్తి ఉంటుంది. ఈ డిజార్డర్ ఉన్నవారికి ఇతరులతో ఎలా ఉండాలో తెలియదు. చేసిన పనిని మళ్ళీ మళ్ళీ చేస్తుంటారు.

## Skype

## మూడు రోజుల్లో స్కైప్ కనుమరుగు

కరోనా సమయంలో పాపులర్ అయిన కొన్ని టెక్నాలజీ సర్వీసులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. అందులో మైక్రోసాఫ్ట్ సర్వీసు స్కైప్ ఒకటి. ఇప్పటికే మార్కెట్లోకి వచ్చి 22 ఏళ్లు అయినా, కొవిడ్ సమయంలో చాలా మంది ఉద్యోగులు, బిజినెస్ సంస్థలు స్కైప్ సర్వీసులు విరివిగా వినియోగించుకున్నారు. కానీ కొవిడ్ అనంతరం క్రమంగా యూజర్ల నుంచి ఆదరణ తగ్గడం, మార్కెట్‌లో పోటీగా మెరుగైన ఇతర ప్రత్యామ్నాయాలు రావడంతో సవాళ్లు ఎదురవుతున్నాయి. దాంతో ఈ సర్వీసును మే 5, 2025 నుంచి నిలిపేస్తున్నట్లు ఇప్పటికే మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. అయితే స్కైప్ యూజర్లకు మైక్రోసాఫ్ట్ టీమ్స్‌వైపు మళ్లించేందుకు అన్ని ప్రయత్నాలు జరిగాయి. కాగా, కంపెనీ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన స్కైప్‌ను ఎందుకు నిలిపేస్తున్నారో నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### మైక్రోసాఫ్ట్ టీమ్స్‌లోకి మార్పు

మైక్రోసాఫ్ట్ తన కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లను ఏకీకృతం చేయడం కూడా స్కైప్‌ను నిలిపేసేందుకు కారణమవుతుంది. మెసేజింగ్, వీడియో కాల్స్ ఇతర సర్వీసుల కోసం దాని ప్రాథమిక కేంద్రంగా మైక్రోసాఫ్ట్ టీమ్స్‌పై పూర్తిగా దృష్టి పెడుతోంది. దాంతో స్కైప్ వినియోగదారులను సైతం ఈ టీమ్స్‌లో చేరమని కొంత కాలంగా కోరుతుంది. ఇప్పటికే చాలామంది టీమ్స్‌లోకి మారారు.

### తగ్గుతున్న ప్రజాదరణ

స్కైప్ కొన్నేళ్లుగా మెరుగైన సర్వీసులు అందిస్తున్నప్పటికీ జూమ్, గూగుల్ మీట్, వాట్సాప్.. వంటి పోటీదారులు కూడా ఈ సర్వీసు అందిస్తున్నారు. దాంతో ఆఫీస్ 365లో భాగంగా ఉన్న మైక్రోసాఫ్ట్ టీమ్స్‌వైపు వినియోగదారులు నడిపించేలా సంస్థ చర్యలు తీసుకుంటోంది.


### వినియోగదారులకు మద్దతుగా..

స్కైప్ నుంచి టీమ్స్‌కు మైగ్రేట్ అయ్యేందుకు మైక్రోసాఫ్ట్ యూజర్లకు చాలా నెలల సమయం ఇచ్చింది. టీమ్‌ల్లోకి లాగిన్ కావడానికి ఇప్పటికే ఉన్న స్కైప్ ఐడీలను ఉపయోగించవచ్చని తెలిపింది. ఇది యూజర్ ట్రాన్స్‌ఫర్మేషన్‌ను సులభతరం చేసింది. చాట్ హిస్టరీలు, కాంటాక్ట్‌లను నిరాటంకంగా టీమ్స్‌కు బదిలీ చేస్తామని మైక్రోసాఫ్ట్ హామీ ఇచ్చింది.

### పెయిడ్ సేవలు నిలిపివేత

స్కైప్ క్రెడిట్, కాలింగ్ ప్రణాళికలతో సహా పెయిడ్ సేవల కోసం కొత్త సబ్‌స్క్రిప్షన్‌లను మైక్రోసాఫ్ట్ నిలిపివేసింది. ఇప్పటికే ఉన్న వినియోగదారులు వారి తదుపరి రీఛార్జ్ సైకిల్ వరకు సబ్‌స్క్రిప్షన్‌లను కొనసాగించవచ్చని తెలిపింది. ఆ తర్వాత పెయిడ్ ఫీచర్లు నిలిచిపోతాయని స్పష్టం చేసింది.

## ఏసీతో పనిలేకుండానే హీట్‌ని బీట్ చేద్దాం ఇలా..!



సూర్యుడి ప్రతాపం రోజు రోజుకి ఎక్కువవుతోంది. పది దాటితో బయటికి రావడమే కష్టంగా ఉంది ఈ సమ్మర్‌లో. ఇక రాత్రిళ్లు ఉక్కపోతలు, తట్టుకోలేని ఉడుకుతో కంటిమీద కునుకు పడితే ఒట్టు అంటూ వాపోతుంటారు ప్రజలు. ఆరుబయట సేద తీరదామన్న..పక్కపక్కనే బిల్డింగ్‌లు ఉండటంతో గాల్పు కొడుతూ వేడిగా ఉంటుంది. రవ్వంత గాలి కూడా రాదు. ఏసీ లేనిదే పనికాదేమో అన్నంతగా సమ్మర్ తారెత్తిస్తుంటుంది. అలాంటప్పుడు ఏసితో పని లేకుండా తక్కువ ఖర్చుతోనే ఇంటిని చల్లగా మార్చుకుని హాయిగా నిద్రపోవచ్చు. అదెలాగా చూద్దామా..!.

**ఇంట్లోనే ఫ్యాన్‌తో..**

బయటి చల్లగాలి లోపలికి వచ్చేలా కిటికీ దగ్గర ఉండే ఫ్యాన్‌ను ఉంచండి లేదా గదిలోపల గాలి ప్రసరణ మెరుగుపరుచుకునేలా సీలింగ్ లేదా స్టాండింగ్ ఫ్యాన్‌ను ఉపయోగించండి. రాత్రి సమయంలో వేడి గాలిని బయటకు నెట్టేలా కిటికీలో బయటకి ఎదురుగా ఫ్యాన్‌ను ఉంచండి. అలాగే ఇత ఓపెనింగ్‌ల నుంచి చల్లని గాలి లోపలకు వచ్చేలా చూసుకోండి

**కర్టెన్లు లేదా బ్లైండ్‌లతో మూసి ఉంచడం**

నేరుగా సూర్యకాంతి గదిలో పడకుండా నిరోధించాలి. అంటే కిటికీలు మూసేయడం. కర్టెన్లు, బ్లైండ్‌లతో కవర్ చేయడం లేదా తడికల్లాంటివి ఏర్పాటు చేసుకోవడం. లేతరంగు లేదా ఇన్సులేటెడ్ కర్టెన్లు ఉపయోగించడం మంచిది. ఇవి 40% వరకు వేడిని తగ్గిస్తాయి.

**రాత్రిపూట గాలి ప్రసరణ కోసం కిటికీలు తెరవడం**

ఫ్యాన్ ముందు మంచు నీరు లేదా మాములు నీళ్లు బకెట్ ఉంచడం..బాష్పీభవన శీతలీకరణను సృష్టించడానికి ఫ్యాన్ ముందు ఒక బకెట్ మంచుగడ్డ లేదా చల్లని నీటిని ఉంచండి. ఈ పద్ధతిఫ్యాన్‌ద్వారా వచ్చే గాలిని చల్లబరుస్తుంది. ఇది పొడి వాతావరణంలో మరింత ప్రభావవంతంగా ఉంటుంది.

**నేలపై పడుకోవడం..**

వేడిగాలి పెరుగుతుంది కాబట్టి నేలపే కూర్చోవడం లేదా పడుకోవడం వల్ల చల్లదనంగా అనిపిస్తుంది.

**తేలికైనా.. గాలి ఆడే దుస్తులు ధరించడం**

తేమను దూరం చేసి.. చర్మం శ్వాస తీసుకోవడానికి వీలు కల్పించే కాటన్ లాటి తేలికైన వదులు దుస్తులను ధరించాలి. ఇవి తేమను దూరం చేస్తాయి. చర్మం శ్వాస తీసుకోవడానికి అనుమతించడమే గాక శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడతాయి

**పరుపు, దిండ్లు చల్లగా ఉండేలా చేయడం..**

పడుకునే ముందే..బెడ్‌షీట్లు, దిండ్లు, పరుపు చల్లగా ఉండేలా కేర్ తీసుకుంటే హాయిగా నిద్రపట్టేస్తుంది.

**తడి తువ్వాళ్లు లేదా స్ప్రే బాటిళ్లు..**

తడి తువ్వాళ్లు వేయడం లేదా చల్లటి నీటితో నిండిన స్ప్రే బాటిల్ రిఫ్రెషింగ్ చల్లదనాన్ని అందిస్తుంది. నిద్రించడానికి ముందు మంచం మీద తడిగా ఉన్న టవల్‌ను ఉంచండి తద్వారా పరుపు చల్లగా ఉంటుంది.

**వేడిని ఉత్పత్తి చేసే వాటిని నివారించడం**

ఉపయోగంలో లేనప్పుడు ఇన్‌కాండిసెంట్ బల్బులు, కంప్యూటర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్‌లను ఆపివేయండి. తక్కువ వేడిని విడుదల చేసి, శక్తిని ఆదా చేసే LED బల్బులను ఎంచుకోండి.

**తేలికగా తినండి, హైడ్రేటెడ్‌గా ఉండండి**

హైడ్రేటెడ్‌గా ఉండటానికి తగినంత నీరు తాగండి. ప్రోటీన్ అధికంగా ఉండే భోజనాలను నివారించి.. పండ్లు, స్మూతీస్ వంటి తాజా చల్లని ఆహారాలు తీసుకోవడం మంచిది. ఈ పద్ధతులన్నీ ఎయిర్ కండిషనింగ్ ఖర్చు లేకుండా వేడి వాతావరణంలో సౌకర్యవంతంగా ఉండటానికి సహాయపడతాయి.

## లాభాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు



శుక్రవారం ఉదయం లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి లాభాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ 259.75 పాయింట్లు లేదా 0.32 శాతం లాభంతో 80,501.99 వద్ద, నిఫ్టీ 12.50 పాయింట్లు లేదా 0.051 శాతం లాభంతో 24,346.70 వద్ద నిలిచాయి. జుల్లుందూర్ మోటార్ ఏజెన్సీ ఢిల్లీ, స్పోర్ట్‌కింగ్ ఇండియా, జోడియాక్ క్లాతింగ్ కంపెనీ, క్రిస్టల్ ఇంటిగ్రేటెడ్ సర్వీసెస్, ఫోర్స్ మోటార్స్ వంటి కంపెనీలు లాభాలను చవి చూశాయి. యునైటెడ్ పాలీఫ్యాబ్ గుజరాత్, గోద్రేజ్ ఆగ్రోవెట్, జీటెక్ జైన్‌ఎక్స్ ఎడ్యుకేషన్, వైశాలి ఫార్మా, మాలు పేపర్ మిల్స్ మొదలైన కంపెనీలు నష్టాలను చవిచూశాయి.



# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



## పాక్ ప్రధాని యూట్యూబ్ ఛానల్ బ్యాన్



జమ్మూ & కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పర్యాటకులను బలిగొన్న ఘోరమైన ఉగ్రవాద దాడిపై కొనసాగుతున్న ఉద్రిక్తతల మధ్య పాకిస్తాన్ ప్రధాన మంత్రి 'షెహబాజ్ షరీఫ్' యూట్యూబ్ ఛానెల్‌ను శుక్రవారం భారతదేశంలో బ్లాక్ చేశారు. కొన్ని రోజుల క్రితం భారత ప్రభుత్వం 16 పాకిస్తానీ యూట్యూబ్ ఛానెల్‌లను నిషేధించిన తర్వాత ఈ ఖాతాలను బ్లాక్ చేశారు. వీటిలో డాన్ న్యూస్, సమా టీవీ, ఏఆర్‌వై న్యూస్ వంటి ప్రముఖ మీడియా సంస్థలు ఉన్నాయి. రెచ్చగొట్టే.. మతపరంగా సున్నితమైన కంటెంట్, తప్పుదారి పట్టించే కథనాలు మాత్రమే కాకుండా భారతదేశానికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారం ప్రసారం చేసినందుకు ఈ ఛానెల్‌లను నిషేధించారు. 'షెహబాజ్ షరీఫ్' యూట్యూబ్ ఛానెల్‌ను బ్లాక్ చేయడంతో పాటు.. గాయకుడు అతిఫ్ అస్లాం, క్రికెటర్లు షాహిద్ అఫ్రిది, బాబర్ ఆజం, నటుడు ఫవాద్ ఖాన్, హనియా అమీర్, మహిరా ఖాన్‌లతో సహా అనేక మంది పాకిస్తాన్ ప్రముఖుల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలు కూడా సస్పెండ్ చేశారు. పహల్గామ్‌లో ఉగ్రవాద దాడి జరిగిన తరువాత.. భారత ప్రభుత్వం సింధు జల ఒప్పందాన్ని నిలిపివేయడం మాత్రమే కాకుండా, అటారీవాఘా సరిహద్దును కూడా పూర్తిగా మూసివేస్తున్నట్లు ప్రకటించింది. భారత్ గగనం తలంలో పాక్ విమాన ప్రయాణాలపై నిషేధం విధించింది.

## పాక్ గగనతలంపై ఆంక్షలు.. ఎయిరిండియాకు వేల కోట్ల నష్టం

**ఢిల్లీ:** కశ్మీర్‌లోని పహల్గాం భూతల స్వర్గం.. ఆ ప్రదేశంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడితో భారత్‌పాకిస్తాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ తరుణంలో పాకిస్తాన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో భారత్‌లోని ప్రముఖ ఏవియేషన్ దిగ్గజం ఎయిరిండియాకు వేలకోట్ల నష్టం వాటిల్లింది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌పై భారత్ కఠిన చర్యలకు ఉపక్రమించింది. దీంతో పాక్ సైతం భారత్‌పై పలు ఆంక్షలు విధించింది. పాక్ గగన తలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఆ నిర్ణయంతో ఎయిరిండియా సుమారు 600 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెలుగులోకి వచ్చాయి. పాక్ గగనతలంపై భారత విమానాల రాకపోకలపై నిషేధం కారణంగా విమానాల దారి మళ్లింపు, పెరిగిన ప్రయాణ దూరం, అదనపు ఇంధనం ఖర్చు చేయాల్సి వస్తుంది. ఫలితంగా ప్రతీ ఏడాది తమ సంస్థకు 591 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ నష్టం నుంచి బయటపడేందుకు ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని కోరుతూ విమానయాన శాఖకు ఎయిరిండియా యాజమాన్యం లేఖ రాసినట్లు సమాచారం. గగనతలంపై పాక్ తీసుకున్న నిర్ణయంతో ఒక్క ఎయిరిండియా మాత్రమే కాదని టాటా గ్రూప్‌కు చెందిన ఇతర విమానాల సర్వీసులపై ప్రభావం పడనున్నట్లు ఆ లేఖలో పేర్కొంది. ఉదాహరణకు ఇండిగో గురువారం న్యూఢిల్లీబాకు (అజర్‌బైజాన్‌లో) విమానం ఐదు గంటల 43 నిమిషాలు ప్రయాణించింది. పాక్ గగన తలం నుంచి కాకుండా దారి మళ్లించిన కారణంగా 38 నిమిషాలు ఎక్కువ సమయం పట్టింది. ఆ సమయానికి అదనంగా ఇంధనం వెచ్చించాల్సి ఉంటుంది. ప్రయాణ సమయంలో ప్రయాణికులకు అందించే ఇతర సర్వీసుల్లో సైతం భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే, మిగితా విమానయాన సంస్థలతో పోలిస్తే ఎయిరిండియా పలు ప్రపంచ దేశాలకు విమానాల రాకపోకలన్నీ పాకిస్తాన్ గగన తలం నుంచే నిర్వహిస్తుంది. పాక్ తాజా నిర్ణయం ఎయిరిండియాపై కాస్త ప్రతికూల ప్రభావం పడనుంది. ఉదాహరణకు, ఢిల్లీమిడిల్ ఈస్ట్ విమానాలు ఇప్పుడు కనీసం ఒక గంట అదనంగా







ప్రయాణించవలసి వస్తుంది, దీనికి ఎక్కువ ఇంధనం అవసరం అవుతుంది. ఎయిరిండియా దాని బడ్జెట్ సర్వీస్, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగోలు గత నెలలో పదిహేను రోజుల్లో న్యూఢిల్లీ నుండి యూరప్, మిడిల్ ఈస్ట్, ఉత్తర అమెరికాలోని గమ్యస్థానాలకు 1,200 విమానాలు బయలుదేరాయని అంచనా.

## ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం




### మల్లికార్జున ఖర్గే

**ఢిల్లీ :** దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుందన్నారు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం ప్రపంచానికి కూడా ఇదే సందేశం ఇచ్చామన్నారాయన. ఈరోజు (శుక్రవారం) జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంలో మల్లికార్జున ఖర్గే మాట్లాడారు. ' పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిగా ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన వ్యూహం కనిపించలేదు. రాహుల్ గాంధీ కాన్పూర్ లో చనిపోయిన శుభం ద్వివేదీ కుటుంబాన్ని కలిశారు. చనిపోయిన వారికి 'అమరుల' హోదా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దేశ భద్రత విషయంలో మొత్తం విపక్షం కేంద్రానికి మద్దతుగా నిలుస్తుంది. ప్రపంచానికి ఇదే సందేశం ఇచ్చాం. మోదీ ప్రభుత్వం జనగణనతో పాటు కులగణన నిర్వహించాలని నిర్ణయించింది. ఇది రాహుల్ గాంధీ దీర్ఘకాలిక ఉద్యమ ఫలితమే. ఆయన "భారత్ జోడో న్యాయ యాత్ర" ద్వారా దీనిని ప్రధాన అజెండాగా మార్చారు. తెలంగాణ, కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటికే కుల సర్వే పూర్తి చేశాయి. 50% రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలి. గణన నుండి వచ్చిన సమాచారాన్ని ప్రభుత్వం మంచి పాలన కోసం ఉపయోగించాలి. కులగణన కచ్చితంగా జరగాలి. ఫలితాలను అమలు చేయాలి. పాలసీలు, చట్టాలు దానికి అనుగుణంగా ఉండాలి. 2021 సాధారణ జనగణన కూడా జరగలేదు. ఇప్పటికీ 2011 డేటానే ఉపయోగిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ యొక్క రిజర్వేషన్ వ్యతిరేక దృక్పథమే ఈ ఆలస్యం వెనుక కారణం' అని మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.

## జైసల్మేర్‌లో పాక్ గూఢచారి అరెస్ట్




పాకిస్థాన్ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్నట్లు ఆరోపణలపై 40 ఏళ్ల జైసల్మేర్ నివాసి పఠాన్ ఖాన్‌ను రాజస్థాన్ ఇంటెలిజెన్స్ అరెస్ట్ చేసింది. భారత సైన్యం కదలికల సమాచారం పంపినట్లు విచారణలో తేలింది. జైసల్మేర్.. పాకిస్తాన్ సరిహద్దుకు సమీపంలో ఉండటం వల్ల గూఢచర్యకు కేంద్రంగా మారిందని అధికారులు గుర్తించారు. 2022లో ఆపరేషన్ సర్హద్‌లో 36 మంది అనుమానిత గూఢచారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఐఎస్ఐ.. భారత సైనిక కార్యకలాపాల సమాచారం సేకరించేందుకు పదేపదే ప్రయత్నిస్తోందని గుర్తించారు. భారత దేశ జాతీయ భద్రతను దెబ్బతీసేందుకు గూఢచర్యం పాకిస్తాన్‌కు ఒక సాధనంగా మారింది. భారత్‌పాకిస్థాన్‌ల భౌగోళికరాజకీయ పోరాటంలో భాగంగా ఈ సంఘటనలు జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

## ఇజ్రాయెల్‌లో భారీ కార్చిచ్చు




**జెరూసలేం:** ఇజ్రాయెల్‌లోని జెరూసలేం సమీపంలో భారీ కార్చిచ్చు చెలరేగింది. పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడుతుండటంతో వేలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 13 మంది గాయపడ్డారు. మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. కార్చిచ్చు ఆందోళనతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రద్దు చేసిన ఇజ్రాయెల్.. మంటలు ఆర్పేందుకు అంతర్జాతీయ సాయం కోరుతోంది. జెరూసలేం నగర శివార్లలో చెలరేగుతున్న భారీ మంటల కారణంగా అధికారులు కేవలం 24 గంటల్లో వేలాది మంది నివాసితులను ఖాళీ చేయించారు. ఇజ్రాయెల్ అత్యవసర వైద్య సేవ ఇప్పటివరకు 23 మందికి చికిత్స అందించింది. వారిలో 13 మంది కాలిన గాయాలు, పొగ పీల్చడంతో ఆసుపత్రి పాలయ్యారు. జెరూసలేం నుంచి టెల్ అవీవ్ వెళ్లే ప్రధాన మార్గంలో మంటలు ఎగిసిపడుతున్నాయి. చుట్టుపక్కల కొండటలపై దట్టమైన పొగలు వ్యాపించిన వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. మంటల ధాటికి చాలా మంది తమ కార్లను వదిలేసి పరుగులు తీయడంతో గందరగోళం నెలకొంది. వందలాది మంది పౌరులు ఇప్పటికీ ప్రమాదంలో ఉన్నారని ఏజెన్సీ హెచ్చరించింది. కార్చిచ్చు కొనసాగుతున్న రూట్ 1 సహా పలు రహదారులను మూసివేశారు.



## బీజేపీ మహిళా మంత్రికి వేధింపులు.. మేసేజ్‌లు

**ముంబై:** మహారాష్ట్ర మంత్రి, బీజేపీ నాయకురాలు పంకజా ముండేను వేధింపులకు గురిచేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని పూణేకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ ఘటనలో కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు వెల్లడించారు. వివరాల ప్రకారం.. మహారాష్ట్ర మంత్రి పంకజా ముండేను కొద్దిరోజులుగా నిందితుడు వేధిస్తున్నాడు. తరచూ ఆమెకు ఫోన్‌లు చేస్తూ అసభ్యంగా మాట్లాడుతున్నాడు. అలాగే, అసభ్యకరమైన మెసేజ్‌లు పెడుతున్నాడు. దీంతో, మహారాష్ట బీజేపీ కార్యాలయానికి చెందిన సోషల్ మీడియా కోఆర్డినేటర్ నిఖిల్ భమ్రే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని ట్రాక్ చేసి పట్టుకున్నారు. మహారాష్ట్ర నోడల్ సైబర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. ఇక, సదరు వ్యక్తిని పూణేకు చెందిన అమోల్ కాలే(25) గుర్తించారు. ఈ నేపథ్యంలో నిందితుడు ఎందుకు పంకజా ముండేను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడ్డాడు?. ఇందులో ఇంకా ఎవరి పాత్ర అయినా ఉందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



## కొత్త కారు కొన్న 'బిగ్ బాస్ 8' నైనిక.. రేటు ఎంతంటే?

బిగ్ బాస్ కొత్త సీజన్ త్వరలో మొదలుకానుంది. ఇప్పటివరకు 8 సీజన్లు జరగ్గా.. కంటెస్టెంట్ వాళ్లలో చాలామంది గుర్తింపు తెచ్చుకున్నారు. మరీ సినిమా అవకాశాలైతే రావట్లేదు గానీ షోలు చేస్తూ సంపాదించుకున్నారు. ఈ క్రమంలోనే గతేడాది 8వ సీజన్ లో పాల్గొన్న డ్యాన్సర్ నైనిక ఇప్పుడు కొత్త కారు కొనుగోలు చేసింది. ఢీ షోతో డ్యాన్సర్ గా కెరీర్ ప్రారంభించిన నైనిక.. ఒకటి రెండు సీజన్లలో పాల్గొంది. మంచి గుర్తింపు తెచ్చుకుంది. అలా వచ్చిన ఫేమ్ తో బిగ్ బాస్ అవకాశం దక్కించుకుంది. కానీ ఎన్ని వారాలు ఉండలేకపోయింది. ఫెర్ఫార్మెన్స్ సరిగా లేకపోవడం వల్ల కొన్ని వారాలకే ఎలిమినేట్ అయిపోయింది. షో నుంచి బయటకొచ్చిన తర్వాత అప్పుడప్పుడు షోల్లో కనిపించిన నైనిక.. మరోవైపు ప్రమోషన్స్ కూడా చేస్తూ సంపాదించుకుంటోంది. ఇప్పుడు అలా దాచుకున్న డబ్బుతో టాటా కారుని కొనుక్కుంది. దీని ధర మార్కెట్ లో రూ.1015 లక్షల మధ్యలో ఉండొచ్చని తెలుస్తోంది.

## ఉత్తమ చిత్రంగా హనుమాన్ నటి మూవీ

హనుమాన్ నటి వరలక్ష్మి శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'శబరి'. తాజాగా ఈ సినిమాకు అరుదైన గౌరవం దక్కింది. దాసరి ఫిలిం అవార్డ్స్ 2025లో ఉత్తమ కథా చిత్రంగా శబరి అవార్డును కైవసం చేసుకుంది. తెలుగు సినిమా పరిశ్రమలో మరోసారి ప్రయోగాత్మక చిత్రం ఈ ఘనతను సాధించింది. ఈ సినిమాను ప్రముఖ ఎన్నారై మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మించారు. తొలి సినిమాకే కథాబలం ఉన్న చిత్రాన్ని ఎన్నుకొని అనిల్ క్యాట్జ్ దర్శకత్వంలో ఈ సినిమాను తెరకెక్కించారు. అద్భుతమైన భావోద్వేగాలతో ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఒక తల్లి తన బిడ్డను రక్షించేందుకు చేసిన ఒంటరి పోరాటాన్ని తెరపై అద్భుతంగా ఆవిష్కరించారు. కాగా.. గతేడాది మే నెలలో థియేటర్లలో విడుదలైన శబరి మూవీకి ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన దక్కించుకుంది.





## విజయ్ దేవరకొండపై కేసు! ఎందుకంటే?

హైదరాబాద్: హీరో విజయ్ దేవరకొండ చిక్కుల్లో పడ్డాడు. గిరిజన ప్రజల గురించి తప్పుగా మాట్లాడారంటూ ట్రైబల్ లాయర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కిషన్ రాజ్ చౌహాన్.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే విజయ్‌పై కేసు నమోదైనట్లు తెలుస్తోంది.

**ఏం జరిగిందంటే?**

సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌కు విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా వెళ్లాడు. అతడు మాట్లాడుతూ.. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. కశ్మీర్ ఇండియాది. కశ్మీరీలు మనవాళ్లే.. రెండేళ్ల క్రితం ఖుషీ సినిమా షూటింగ్ అక్కడే జరిపాం. అక్కడ చాలామంచి జ్ఞాపకాలున్నాయి. పాకిస్తాన్ వాళ్లు.. అక్కడి ప్రజలనే చూసుకోలేరు.. అలాంటిది ఇక్కడేం చేయాలని చూస్తున్నారో! ఇండియా.. పాకిస్తాన్‌పై దాడి చేయాల్సిన అవసరం లేదు. అక్కడి ప్రజలకే విరక్తి వచ్చి పాక్ ప్రభుత్వంపై తిరగబడతారు. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ (గిరిజనులు) కొట్టుకున్నట్లు.. బుద్ధి లేకుండా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఇలాంటి పనులు చేస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా ఉండాలి అని స్పీచ్ ఇచ్చాడు. ఉగ్రవాదులను గిరిజనులతో పోల్చడంపై వ్యతిరేకత వచ్చింది.

## ఓటీటీలో మరో క్రైమ్ థ్రిల్లర్.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?




ఓటీటీలు వచ్చాక ఏడాపెడా వెబ్ సిరీస్‌లు వచ్చేస్తున్నాయి. ముఖ్యంగా ఓటీటీలో క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌లకు విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ఈ నేపథ్యంలో వెబ్ సిరీస్‌లు ఎక్కువగా ఆ జోనర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ జోనర్ ఇష్టపడే వారికోసం మరో క్రైమ్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ త్వరలోనే అలరించనుంది. రోషన్ మాథ్యూ , మోహిత్ రైనా, త్రినేత్ర ప్రధాన పాత్రల్లో నటించిన తాజా క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'కంకాజుర'. ఈ సిరీస్‌కు చందన్ అరోరా దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సిరీస్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ థ్రిల్లర్ సిరీస్ సోనీలివ్‌లో ఈనెల 30 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఇజ్రాయెల్ సిరీస్ మ్యాగ్‌పీ ఆధారంగా ఈ సిరీస్‌ను హిందీలో తెరకెక్కించారు. టీజర్ చూస్తే తనను అవమానించిన వారిపై పగతీర్చుకునే ఓ యువకుడి కథ ఆధారంగా ఈ సిరీస్ తెరకెక్కించినట్లు తెలుస్తోంది.




## కింగ్డమ్ స్టోరీని రివీల్ చేసిన మొదటి పాట

విజయ్ దేవరకొండ లేటెస్ట్ మూవీ 'కింగ్డమ్'. మే 30న థియేటర్లలోకి రానుంది. కొన్నిరోజుల ముందు వరకు సినిమా వాయిదా పడుతుందని రూమర్స్ వినిపించాయి. కానీ తాజాగా పాటతో ప్రమోషన్స్ తో మొదలుపెట్టడంతో పుకార్లకు చెక్ పడింది. ఇప్పుడు ఆ పాటని రిలీజ్ చేశారు. 'హృదయం లోపల..' అంటూ సాగే ఈ గీతంలో కింగ్డమ్ సినిమా కథేంటి అనేది కొంతలో కొంత రివీల్ చేశారని చెప్పొచ్చు. సూరి అనే రౌడీ, అతడితో ప్రేమలో ఉన్న ఓ డాక్టర్.. వీళ్లిద్దరూ కలిసి శ్రీలంక ఆర్మీపై ఏదో ప్లాన్ చేస్తున్నట్లు కనిపించారు. అదేంటి అనేది మాత్రం సినిమా చూసి తెలుసుకోవాలి. కింగ్డమ్ సినిమాలో సూరి అనే పాత్రలో విజయ్ దేవరకొండ కనిపించాడు. అతడి ప్రేయసిగా భాగ్యశ్రీ బోర్సే నటించింది. ఈ పాటలో ఓవైపు చంపడం చూపిస్తూనే, చివర్లో రొమాన్స్ కూడా చూపించారు. సినిమా కూడా అటు యాక్షన్, ఇటు రొమాన్స్ అనేలా ఉంటుందని హింట్ ఇచ్చారేమో?



# క్రీడా వార్తలు | SPORTS NEWS





## గుజరాత్ చేతిలో ఓటమి
### సన్‌రైజర్స్ ప్లే ఆశలు గల్లంతు!

ఐపీఎల్ 2025లో సన్‌రైజర్స్ హైదరాబాద్ కథ దాదాపు ముగిసినట్లే. ప్లే ఆఫ్స్ రేసులో నిలవాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ తేలిపోయింది. అహ్మదాబాద్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 38 పరుగుల తేడాతో ఎస్ఆర్‌హెచ్ ఓటమి పాలైంది. 225 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 186 పరుగులు మాత్రమే చేయగల్గింది. లక్ష్య చేధనలో ఓపెనర్లు మంచి అరంభం ఇచ్చినప్పటికి, మిడిలార్డర్ విఫలమం కావడంతో ఆరెంజ్ ఆర్మీ ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఎస్ఆర్‌హెచ్ బ్యాటర్లలో అభిషేక్ శర్మ(74) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. మిగితా బ్యాటర్లు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయలేకపోయారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ, సిరాజ్ తలా రెండు వికెట్లు సాధించగా.. ఇషాంత్ శర్మ, కోయిట్జీ తలా వికెట్ సాధించారు.

**గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్..**

అంతకుముందు బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగులు చేసింది. గుజరాత్ బ్యాటర్లలో కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (76) టాప్ స్కోరర్‌గా నిలవగా.. జోస్ బట్లర్ (64), సుదర్శన్ (48) పరుగులతో రాణించారు. సన్‌రైజర్స్ బౌలర్లలో జయ్‌దేవ్ ఉనద్కట్ మూడు వికెట్లు పడగొట్టగా.. కమ్మిన్స్, అన్సారీ తలా వికెట్ సాధించారు. కాగా ఇప్పటివరకు పది మ్యాచ్‌లు ఆడిన సన్‌రైజర్స్ కేవలం మూడు విజయాలతో పాయింట్ల పట్టికలో రెండోస్థానంలో కొనసాగుతోంది.

## చరిత్రకు అడుగు దూరంలో విరాట్ కోహ్లి..



ఐపీఎల్ 2025లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా ఆర్సీబీ శనివారం చిన్నస్వామి స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో ఎలాగైనా గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలని బెంగళూరు భావిస్తోంది. అయితే సీఎస్‌కేతో మ్యాచ్‌కు ముందు ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లి (Virat Kohli)ని అరుదైన రికార్డు ఊరిస్తోంది. ఈ మ్యాచ్‌లో కోహ్లి మరో 53 రన్స్ చేస్తే.. ఐపీఎల్ చరిత్రలో 8,500 పరుగుల మైలురాయిని తొలి ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. ఇప్పటివరకు విరాట్ . 262 మ్యాచ్‌ల్లో 8,447 పరుగులు చేశాడు. కోహ్లి తర్వాతి స్థానంలో ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ(6921) ఉన్నాడు. అయితే కోహ్లి కంటే రోహిత్ దాదాపు 2000 పరుగులు వెనకబడి ఉన్నాడు. ఇక 2008లో ఆర్సీబీ తరపున ఐపీఎల్ అరంగేట్రం చేసిన కింగ్ కోహ్లి.. ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడి ఐపీఎల్ కెరీర్‌లో 8 సెంచరీలతో పాటు 61 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఈ ఏడాది సీజన్‌లో కూడా కింగ్ కోహ్లి దుమ్ములేపుతున్నాడు. వరుస హాఫ్ సెంచరీలతో ప్రత్యర్థి జట్లపై విరుచుకుపడుతున్నాడు. కోహ్లి 10 మ్యాచ్‌ల్లో 138.87 స్ట్రైక్ రేట్‌తో 443 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లలో ఆరు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. ఆరెంజ్ క్యాప్ జాబితాలో మూడవ స్థానంలో ఈ ఆర్సీబీ మాజీ కెప్టెన్ కొనసాగుతున్నాడు.


## ముంబైని ఓడించడం అంత ఈజీ కాదు..
### టాప్-2లో నిలుస్తుంది: హర్భజన్

ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్ జైత్ర యాత్ర కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో భాగంగా గురువారం జైపూర్ వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 100 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్ ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ముంబై పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ముంబై ఇండియన్స్‌పై భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఈ ఏడాది సీజన్ గ్రూపు స్టేజి పాయింట్ల పట్టికలో ముంబై మొదటి రెండు స్థానాల్లో నిలుస్తుందని జోస్యం చెప్పాడు. "రాజస్తాన్ రాయల్స్‌పై ముంబై ఇండియన్స్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. ప్రస్తుతం ముంబై ఛాంపియన్ టీమ్‌లా ఆడుతోంది. ముంబై ప్లేయింగ్ ఎలెవన్‌లో పది మంది ఆటగాళ్లకు ఒంటి చేత్తో మ్యాచ్‌ను గెలిపించే సత్తా ఉంది. ఏ జట్టుకైనా హార్దిక్ సేనను ఓడించడం అంత సులువు కాదు. కచ్చితంగా గ్రూపు స్టేజిలో ముంబై టాప్ 2లో నిలుస్తుందని నేను భావిస్తున్నాను. ముంబై గ్రూపు స్టేజిని 18 లేదా 20 పాయింట్లతో ముగుస్తుందని" హర్భజన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో పేర్కొన్నాడు.



## శుబ్‌మన్ గిల్‌ది ఔటా? నాటౌటా?

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుబ్‌మన్ గిల్ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో భాగంగా శుక్రవారం అహ్మదాబాద్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో గిల్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. తొలి ఓవర్ నుంచే ఎస్ఆర్‌హెచ్ బౌలర్లను ఊతికారేశాడు. మహ్మద్ షమీ, కమ్మిన్స్ వంటి వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం గిల్ వదలేదు. ఈ క్రమంలో కేవలం 25 బంతుల్లోనే తన హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. ఆ తర్వాత కూడా గిల్ ఎక్కడ తగ్గలేదు. దీంతో అతడు దూకుడు చూసి మూడెంకల స్కోర్‌ను అందుకుంటాడని అంతా భావించారు. సరిగ్గా ఇదే సమయంలో గిల్‌ను దురదృష్టం వెంటాడింది. అనుహ్యంగా గిల్ రనౌట్ రూపంలో పెవిలియన్‌కు చేరాడు. దీంతో కేవలం 38 బంతుల్లోనే 10 ఫోర్లు, 2 సిక్స్‌లతో 76 పరుగులు చేసిన గిల్.. తీవ్ర నిరాశతో డగౌట్‌కు చేరాల్సి వచ్చింది. అయితే గిల్ ఔటైన తీరు వివాదస్పదమైంది.



**ఏమి జరిగిందంటే?**

గుజరాత్ ఇన్నింగ్స్ 13 ఓవర్ వేసిన జీషన్ అన్సారీ బౌలింగ్‌లో ఆఖరి బంతికి జోష్ బట్లర్.. షార్ట్ ఫైన్ లెగ్ దిశగా ఆడాడు. ఆ బంతికి బట్లర్, గిల్ క్విక్ సింగిల్ తీసేందుకు ప్రయత్నించారు. నాన్‌స్ట్రైక్ నుంచి గిల్ వికెట్ కీపర్ వైపు వచ్చేటప్పటికి బంతిని హర్షల్ పటేల్ త్రో చేశాడు. అయితే గిల్ క్రీజులోకి వచ్చేటప్పుడు వికెట్ కీపర్ క్లాసెన్ స్టంప్స్ ను పడగొట్టాడు. అయితే క్లాసెన్ బంతితో కాకుండా తన గ్లౌవ్స్‌తో స్టంప్స్‌ను పడగొట్లు అన్పించింది. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్లు అంత ఉత్సాహంగా అప్పీల్ చేయలేదు. ఏదేమైనప్పటికి ఫీల్డ్ అంపైర్‌లు థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేశారు. రీప్లేలు గిల్ క్రీజుకు షార్ట్‌గా ఉన్నప్పటికీ, క్లాసెన్ తన గ్లోవ్స్‌తో బెయిల్స్‌ను పడగొట్టినట్లు కన్పించింది. కానీ పలు కోణాల్లో రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్ తన నిర్ణయాన్ని ఔట్‌గా ప్రకటించి అందరికి షాకిచ్చాడు. థర్డ్ అంపైర్ నిర్ణయంపై గిల్ కూడా అసహనం వ్యక్తం చేస్తూ మైదానాన్ని వీడాడు.

## చరిత్ర సృష్టించిన సాయి సుదర్శన్.. సచిన్ రికార్డు బద్దలు

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ యువ ఓపెనర్ సాయిసుదర్శన్ తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో భాగంగా అహ్మదాబాద్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో సుదర్శన్ విధ్వంసం సృష్టించాడు. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే ఎస్ఆర్‌హెచ్ బౌలర్లను ఊతికారేశాడు. ముఖ్యంగా గుజరాత్ ఇన్నింగ్స్ మూడో ఓవర్ వేసిన స్టార్ పేసర్ మహ్మద్ షమీకి సుదర్శన్ చుక్కలు చూపించాడు. ఆ ఓవర్‌లో ఐదు ఫోర్ల సాయంతో ఏకంగా 20 పరుగులు పిండుకున్నాడు. ఓవరాల్‌గా 23 బంతులు ఎదుర్కొన్న 9 ఫోర్ల సాయంతో 48 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ క్రమంలో సుదర్శన్ ఓ అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టీ20ల్లో అత్యంతవేగంగా 2000 పరుగుల మైలు రాయిని అందుకున్న భారత క్రికెటర్‌గా సాయి సుదర్శన్ రికార్డు సృష్టించాడు. సుదర్శన్ కేవలం 54 ఇన్నింగ్స్‌లలో అందుకున్నాడు. ఇంతకుముందు ఈ రికార్డు భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉండేది. సచిన్ ఈ ఘనతను 59 ఇన్నింగ్స్‌లలో అందుకున్నాడు. తాజా మ్యాచ్‌తో సచిన్ రికార్డును ఈ తమిళనాడు బ్యాటర్ బ్రేక్ చేశాడు. ఓవరాల్‌గా ఈ రేర్ ఫీట్ సాధించిన జాబితాలో ఆస్ట్రేలియా మాజీ ఓపెనర్ షాన్ మార్ష్(53) అగ్రస్థానంలో ఉండగా.. రెండో స్థానంలో సుదర్శన్ కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు ఈ రికార్డు బ్రాడ్ హాడ్జ్ , మార్కస్ ట్రెస్కోథిక్, ముహమ్మద్ వసీం పేరిట సంయుక్తంగా ఉండేది. తాజా మ్యాచ్‌తో వీరిని సుదర్శన్ అధిగమించాడు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com